ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 9 డిసెంబరు 2025

గప్‌చుప్..!

- నిధుల స్వాహా తేలినా చర్యలు ఏవీ?
- సర్దుకుంటారా.. చర్యలు తీసుకుంటారా?
- పశుసంవర్ధక శాఖలో రూ.కోటికిపైగా స్వాహా
- గత నెలలో స్టేట్ ఆడిట్ బృందం విచారణ
- కీలక ఆధారాల సేకరణ.. రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదిక
- చర్యలు లేకపోవడంపై అనుమానాలు



ఇటీవల పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్‌తో సమావేశమైన ఆడిట్ బృందం అధికారులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్ధక శాఖలో జరిగిన రూ.కోటికిపైగా నిధుల స్వాహాపై సర్దుకుంటారా..? చర్యలు తీసుకుంటారా..? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. పశుసంవర్ధక శాఖలో గతంలో ఇక్కడ పని చేసిన ఓ జేడీ జేడీ పలువురు సిబ్బందితో కుమ్మక్కై శాఖ బ్యాంక్ ఖాతాల నుంచి నిధులు స్వాహా చేయడం కలకలం రేకెత్తించింది. పశుసంవర్ధక శాఖకు సంబంధించిన ఈ మెయిల్‌లో పలు బ్యాంక్‌ల నుంచి వచ్చిన మెసేజ్‌లతో నిధులు స్వాహా పర్వం బయట పడినట్లు సమాచారం. బ్యాంక్‌ల నుంచి వచ్చిన మెసేజ్‌లను గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఉన్నతాధికారి తెలివిగా డిలీట్ చేసినట్లు సమాచారం. అయితే ఇవి ఎందుకు డిలీట్ అయ్యాయని లోతుగా సమాచారం సేకరించగా పశుసంవర్ధక శాఖ నిధులు భారీగా బయటి వ్యక్తుల ఖాతాల్లో జమ అయినట్లు తేలింది. ఇదే విషయాన్ని ప్రస్తుత ఉన్నతాధికారి రాష్ట్ర డైరెక్టర్‌కు లిఖిత పూర్వకంగా నివేదించినట్లు తెలిసింది.

గత నెలలో స్టేట్ ఆడిట్ బృందం విచారణ

నిధుల స్వాహాను నిగ్గు తేల్చేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన స్టేట్ ఆడిట్ బృందాన్ని విచారణకు నియమించారు. గత నెల 13, 14 తేదీల్లో రెండు రోజులపాటు ఆడిట్ బృందం అధికారులు సత్యనారాయణ, చక్రధర్, గంగాశంకర్‌లు పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయానికి వచ్చి పలు వివరాలు సేకరించారు. జేడీ ప్రేమ్‌చంద్, పలు విభాగాల అధికారులతో నిధులు స్వాహాపై ఆరా తీశారు. డిపార్టుమెంట్ ఖాతాల నుంచి ఇతరుల ఖాతాలకు ఎంత డబ్బులు జమ అయ్యాయి..? అందుకు సంబంధించిన ఉన్నతాధికారుల అనుమతులు ఉన్నాయా..? ఏ ప్రాతిపదికగా ఇతరుల ఖాతాల్లోకి సొమ్మును బదలాయించారు..? నగదు రూపంలో ఎంత డబ్బులు డ్రా చేశారు..? చెక్కు రూపంలో ఏమైనా డబ్బులు డ్రా చేసి, ఇతరుల ఖాతాలకు జమ చేశారా..? తదితర అంశాలపై ఆరా తీశారు.

కీలక ఆధారాలు బట్టబయలు..!

నిధులు స్వాహా వ్యవహారంపై ఆడిట్ అధికారుల విచారణలో కీలక అంశాలు బట్టబయలైనట్లు సమాచారం. స్వాహాలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీతోపాటు పలు విభాగాలకు చెందిన సిబ్బంది పాత్ర ఉన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు సమాచారం. గతంలో ఇక్కడ జేడీగా పనిచేసిన ఉన్నతాధికారి పలువురు సిబ్బంది సహకారంతో ఐదారు డిపార్టుమెంట్ ఖాతాల నుంచి రూ.కోటికిపైగా నిధులు స్వాహా చేసినట్లు సమాచారం. ఇందులో కొందరు సిబ్బందికి వాటాలు వెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఓ విభాగం సీనియర్ అసిస్టెంట్‌కు తెలియకుండానే డిపార్టుమెంట్ ఖాతా నుంచి లక్షలాది రూపాయలను గతంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి తమ కుటుంబ సభ్యుల ఖాతాలకు బదలాయించినట్లు సమాచారం. నిధుల స్వాహా విషయం బయటకు పొక్కుతుందన్న అనుమానంతో పలు రకాల వోచర్లు, బిల్లులకు సంబంధించిన సమాచారాన్ని కనిపించకుండా గతంలోనే మాయం చేశారన్న ఆరోపణలున్నాయి. ఆడిట్ బృందం తమ విచారణలో వెలుగు చూసిన అంశాలపై ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు నివేదికలు సమర్పించినట్లు సమాచారం.

మరోసారి సమగ్ర విచారణ..!

జిల్లా పశుసంవర్ధక శాఖలో జరిగిన అవినీతి బాగోతంపై మరో సారి సమగ్ర విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. గత నెలలో రెండు రోజులపాటు స్టేట్ ఆడిట్ బృందం విచారణ చేసింది. విచారణ సమయంలో తగిన సమాచారం లభించకపోవడంతో తాజాగా రెండు సార్లు పలు వివరాలను పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారి నుంచి సేకరించినట్లు తెలిసింది. పశుసంవర్ధక శాఖలో ప్రతి రెండేళ్లకు ఒక సారి ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. 2 సంవత్సరాల 10 నెలలుదాటినా ఆడిట్ జరగలేదు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు సొమ్ము స్వాహా నేపథ్యంలో త్వరలో ఆడిట్ బృందాలు ఆడిట్ నిర్వహించేందుకు రానున్నట్లు సమాచారం. పూర్తి స్థాయిలో ఆడిట్ నిర్వహిస్తే నిధుల స్వాహాలో మరిన్ని విషయాలు పూర్తి స్థాయిలో తెలుస్తాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే మరో సారి విచారణ జరగకుండా నిధుల స్వాహాకు పాల్పడిన ఓ ఉన్నతాధికారి తనదైన శైలిలో చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. సొమ్ము రికవరీ చేయించి, ఎలాంటి చర్యలు లేకుండా చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

సర్దుకుంటారా..? చర్యలు తీసుకుంటారా..?

డిపార్టుమెంట్ ఖాతా నుంచి అనధికారికంగా నిధులను స్వాహా చేయడం ఆషామాషీ వ్యవహారం కాదు. విచారణలో బాధ్యులుగా తేలిన అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. విశ్రాంత అధికారులు ఈ వ్యవహారంలో ఉంటే... వారిపైనా క్రిమినల్ కేసులతోపాటు వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న బెనిఫిట్స్ ఆపే అవకాశం ఉంటుంది. ఆడిట్ బృందం అధికారులు విచారణ చేసి, మూడు వారాలు దాటినా రాష్ట్ర ఉన్నతాధికారులు తదుపరి నిర్ణయం ప్రకటించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

హైవేపై దోపిడీ

రూ.3 కోట్ల హవాలా సొమ్ముతో పరార్
సూరత్ నుంచి బెంగళూరుకు వెళుతుండగా అటాక్
ఇద్దరు డ్రైవర్లను అపహరించి.. వదిలేసిన దుండగులు
పోలీసుల అదుపులో డ్రైవర్లు
రూ.1.20 కోట్లు, రెండు కార్లు స్వాధీనం



హైవేపై కారును అడ్డగించిన దుండగులు

పెనుకొండ బాబయ్య దర్గాలో ఉరుసు. హైవేపై ఒకటే రద్దీ..! అదే సమయంలో జాతీయ రహదారిపై హల్‌చల్ చేసే బైక్ రైడర్ల కోసం పోలీసులు కాపు కాశారు. వారికి ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'వై జంక్షన్ వద్ద ఇద్దరిని కిడ్నాప్ చేశారు. ఐదు కార్లలో వచ్చి.. ఓ కారును అడ్డుకుని.. ఎత్తుకు పోయారు..' అని సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాల తనిఖీ చేపట్టారు. పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు కనిపించాయి. పోలీసులను చూడగానే ఓ కారులో ఎక్కి అందరూ పారిపోయారు. మరోకారును అక్కడే వదిలేశారు. అందులో ఉన్న రూ.1.20 కోట్ల నగదును కూడా..! ఈ నెల 3వ తేదీ తెల్లవారుజామున జరిగింది ఈ సంఘటన. హైవేపై వెళుతున్న ఓ టెకీ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు వేట ప్రారంభించి, కీలక సమాచారం సేకరించారు. సూరత్ నుంచి బెంగళూరుకు తరలుతున్న హవాలా సొమ్మును దోచుకున్నట్లు తేల్చారు. కారులో రూ.4.30 కోట్లు ఉండగా, పోలీసులు వెళ్లేలోగా రూ.3 కోట్లకు పైగా సొమ్మును తమ కారులోకి మార్చుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

రామగిరి డీటీ అరెస్టు

అతడి తల్లిదండ్రులు కూడా..
అమూల్య, ఆమె కొడుకు మృతి కేసులో 14 రోజుల రిమాండ్

6

వద్దన్నా వినకుండా...

విద్యార్థులను టూర్‌కు తీసుకెళ్లిన లెక్చరర్
డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎస్ఐ చెప్పినా డోంట్‌కేర్
శెట్టూరు మోడల్ స్కూల్ లెక్చరర్‌పై చర్యలకు సిద్ధమైన విద్యాశాఖ

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల అనుమతి లేదు. ఎస్ఐ హెచ్చరికలు లెక్కేలేదు. ఎవరు వారించినా వినకుండా ఓ లెక్చరర్ మోడల్ స్కూల్ విద్యార్థులను టూరుకు తీసుకెళ్లడం వివాదాస్పదంగా మారింది. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన ఆయనకు చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. శెట్టూరు ఏపీ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఓ లెక్చరర్ గత శనివారం రాత్రి ఆ పాఠశాల విద్యార్థులను టూర్‌కు తీసికెళ్లడానికి నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆ స్కూల్ ప్రిన్సిపాల్ అనుమతి నిరాకరించారు. అయినా ఆ లెక్చరర్ పట్టు బట్టడంతో అనుమతి కోసం విద్యాశాఖకు లేఖ పెట్టారు. డీఈఓ ఆఫీస్ అధికారులు వారికి అనుమతి నిరాకరించారు. అయినా ఆలెక్చరర్ తన మొండి పట్టు వీడకుండా టూర్‌కు సిద్ధమయ్యారు. శనివారం రాత్రి విద్యార్థులతో కలిసి వెళ్లడానికి ఓ బస్సును సిద్ధం చేశారు. రాత్రికి ఆ బస్సు శెట్టూరుకు వచ్చింది. ఈ విషయాన్ని డీఈఓ ప్రసాద్‌బాబు దృష్టికి ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తీసుకెళ్లారు. దీంతో డీఈఓ ఆ లెక్చరర్‌కు ఫోన్ చేసి వెళ్లవద్దని సీరియస్‌గా హెచ్చరించారు. డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, ఆ మండల ఎంఈఓ సైతం ఫోన్‌చేసి హెచ్చరించారు. అయినా ఆ లెక్చరర్ వినకపోవడంతో ఆ మండల ఎస్ఐ దృష్టికి విద్యాశాఖ అధికారులు తీసికెళ్లారు. ఎస్ఐ అక్కడకు వెళ్లి ఆలెక్చరర్‌ను హెచ్చరించి వచ్చిన బస్సును వెనక్కు పంపుతున్నామని అధికారులకు చెప్పగా సమస్య సర్దుమణిగిందనుకున్నారు.

ఎస్ఐ కళ్లు గప్పి...

కానీ ఆ లెక్చరర్ తన మొండి పట్టుదలను వీడకుండా అధికారులు, ఎస్ఐ కళ్లు గప్పారు. బస్సును ఊరి చివర నిలబెట్టించి విద్యార్థులను అక్కడకు చేర్చి, అనుకున్నట్లుగానే టూర్‌కు తీసుకెళ్లారు. దీంతో విద్యార్థుల భద్రతపై అధికారులందరూ టెన్షన్ పడ్డారు. అయితే ఆదివారం రాత్రికి తిరిగి విద్యార్థులు క్షేమంగా తిరిగిరావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

చర్యలు తీసుకుంటాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

అనుమతి లేకుండా, వద్దని చెప్పినా వినకుండా, మొండిగా విద్యార్థులను టూర్‌కు తీసికెళ్లిన విషయం వాస్తవం. విద్యార్థులను తీసకెళ్లిన ఆ ఆ లెక్చరర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఫైల్ సిద్ధం చేశాం. ఆర్జేడీకి పంపి అక్కడ నుంచి వచ్చే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ ఆనంద్.. కిక్కిరిసిన కలెక్టరేట్
498 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్


అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌తో కలెక్టరేట్ కిక్కిరిసింది. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు 498 అర్జీలు అందజేశారు. కలెక్టర్‌తో పాటు జేసీ శివ్‌నారాయణ్‌శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జున, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు వినతులు స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ఉండరాదన్నారు. పెండింగులో ఉంచకుండా తక్షణం పరిష్కరించాలని తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతి రోజూ సమీక్షిస్తూ అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం నగర పరిధిలోని హెచ్చెల్సీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ఆ సమస్యను పరిష్కరించాలని భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి కోరాడు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. తాడిపత్రి పరిధిలోని వంక పోరంబోకు భూములను ఆక్రమించి రియల్ ఎస్టేట్ చేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ భూములకు సంబంధించి సర్వే చేసి హద్దులు వేయాలని కోరారు. అనంతరం పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడారు. తాడిపత్రి మీదుగా ఎర్రకాలువ అనే వంక 15కిలోమీటర్ల మీదుగా వెళ్తుందని, ఆ కాలువ పరిధిలో వంక పోరంబోకు భూములు ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.

ఫైన్ లేకుండా నేటి వరకే పది ఫీజు: డీఈఓ

అనంతపురం విద్య, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): అపరాధ రుసుం లేకుండా మంగళవారం వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించవచ్చని డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 వరకు రూ.50తో, 15వరకు రూ200లు, 18వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంటుందన్నారు. హెచ్ఎంలు యుడైస్ పోర్టల్‌లో విద్యార్థుల వివరాలు ధృవీకరించి వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్‌చేసి పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ కోరారు.

పొగ మంచు..!

కొమ్మ కొమ్మకూ చెమ్మ





చల చల్లటి సూరీడు



చలిగా ఉంది.. పోదాం పదమ్మా ఇంటికి..

చూడటానికి
నువ్వు బాగుంటావు
చూడటానికి ఎదుట
ఏవీ కనిపించనంతగా
ప్రతి శీతవేళా అల్లుకుంటావు..!

ఎన్నెన్ని విషాలు నింపుకున్నావో..
ఇంకెన్ని విపత్తులు దాచుకున్నావో..!
చూడటానికే నువ్వు బాగుంటావు..!
చూపులకు ఆవల ప్రమాదం నువ్వు..!

(అనంతపురం నగరం, శివారు ప్రాంతాలలో సోమవారం ఉదయం కమ్ముకున్న పొగమంచు)



పదండి ముందుకు.. కాస్త నెమ్మదిగా..

ఖాకీల కారుణ్యం

- రైల్వే స్టేషన్‌లో తల్లి మరణం
- సొంతూరుకు తీసుకెళ్లలేని స్థితిలో కుమారుడు
- అర్ధరాత్రి వేళ స్పందించి సాయం చేసిన త్రీటౌన్ పోలీసులు




మృతదేహాన్ని అంబులెన్స్‌లోకి ఎత్తుతున్న సీఐ, సిబ్బంది

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కరకు ఖాకీ చొక్కా వెనుక కరుణతో నిండిన హృదయం ఉందని త్రీటౌన్ పోలీసులు నిరూపించారు. అర్ధరాత్రివేళ తల్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లడం చేతకాక నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తికి సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా..శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం గోపదేవరపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి(47)కి భర్త మరణించాడు. కొంతకాలంలో కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు కూలి పనుల కోసం బెంగళూరుకు వెళ్లాడు. పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు మాత్రం అమ్మకు వైద్యం చేయించడానికి ఆమెకు తోడుగా ఉన్నాడు. వీరు డయాలసిస్ కోసం నాలుగు రోజుల కిందట అనంతపురం పెద్దాస్పత్రికి వచ్చారు. వచ్చారు. తిరిగి ఇంటికి వెళ్లడానికి చార్జీలకు డబ్బులు లేక ఇబ్బంది పడుతూ ఉండిపోయారు. ఎలాగోలా ఆదివారం రాత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. లేపాక్షికి వెళ్లేందుకు స్టేషన్‌లో వేచి ఉన్నారు. అయితే వెంకటలక్ష్మి రాత్రి 9 గంటల సమయంలోనే మరణించింది. ఈవిషయనిఖ్న కుమారుడు అర్ధరాత్రి గుర్తించాడు. తల్లి మృతదేహాన్ని సొంతూరు తీసుకెళ్లడానికి కూడా స్తోమత లేని పేదరికం. పైగా చలి, అర్ధరాత్రి. దిక్కుతోచని స్థితిలో అతడు డయల్ 100 ద్వారా పోలీసులను ఆశ్రయించాడు. త్రీటౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఒంటి గంటప్పుడు తన సిబ్బందితో రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. పరిస్థితిని తెలుసుకుని మృతదేహాన్ని వాళ్ల సొంతూరు తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించారు. డ్యూటీలో సీఐ, ఇతర సిబ్బంది మృతదేహాన్ని ఎత్తుకెళ్లి అంబులెన్స్‌లో పెట్టారు. నిస్సహాయ స్థితిలో ఉన్న తనకు సాయం చేసిన పోలీసులకు కుమారుడు వెంకటేశ్వర్లు భావోద్వేగంతో చేతులెత్తి నమస్కరించాడు.

ఈవో లీలలు

విధుల కన్నా.. అర్జనకే ప్రాధాన్యం..?
పాలపాటిదిన్నెలో వైసీపీ నాయకుడితో కలిసి అడ్డగోలు దోపిడీ
తన పేరు మీదే రూ.2.50 లక్షల చెక్కు



కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆలయ ఆస్తులు, దేవుళ్ల ఆభరణాలు, భక్తులిచ్చే విరాళాలను పరిరక్షించాల్సిన ఈవోనే దోచేశాడు. పబ్లిక్‌గా అమ్మవారి ఆభరణాలను చోరీ చేసుకెళ్తూ పట్టుబడ్డాడు. కదిరి మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఈవో మురళీక్రిష్ణ ఆదివారం చేతివాటం ప్రదర్శించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయన కదిరి ప్రాంతంలోని ఏడు దేవాలయాలకు కార్యనిర్వాహణాధికారిగా వ్యవహరిస్తున్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలోనే ఇంత దోచుకుంటే.. నల్లచెరువు మండలంలో ప్రసిద్ధిచెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి, మిగిలిన దేవాలయాల్లో ఎంత దోచుకున్నారో అని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాలపాటిదిన్నె ఆలయంలో ఈవోకి చేదోడుగా ఉంటున్న ఓ వైసీపీ నాయకుడు పెత్తనం చెలాయిస్తున్నాడు. అన్నదానం మొదలుకుని లడ్డూల వరకు అన్నింటా ఆయనదే హవా అన్న చర్చలు వినిపిస్తున్నాయి. భక్తులు సమర్పించిన సొమ్ములకు లెక్కాపత్రం లేకుండా పోయింది. స్వామివారికి అందే విరాళాలు కొంత అయితే, అధిక మొత్తంలో ఈవో, వైసీపీ నాయకుడు స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్నదానంతోపాటు, స్వామివారిని ప్రత్యేక దర్శన టికెట్ల రూపంలో ప్రతి శనివారం రూ.30వేల వరకు ఆదాయం ఉంటుంది. శ్రావణమాసం అయితే వారం వారం రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. ఎర్రదొడ్డి గంగమ్మ అమ్మవారిని ప్రతి ఆది, మంగళవారాల్లో వివిధ రూపాల్లో అలంకరిస్తారు. గంగమ్మ వద్ద బలిచ్చే ప్రతి జంతువుకు రూ.వంద వసూలు చేస్తారు. వందల సంఖ్యలో బలులు జరుగుతుంటాయి. ఆ సొమ్ము అంతా ఎక్కడికి పోతుందో తెలియని పరిస్థితి. పాలపాటిదిన్నెలో అన్నదానానికి వచ్చిన భక్తులు విరాళాలు ఇస్తారు. అవి కొన్నింటికి రసీదులిస్తుంటే, మరికొన్నింటికి ఇవ్వకుండా ఈఓతోపాటు వైసీపీ నాయకుడు జేబుల్లోకి వేసుకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రావణమాసం (మిగతా 6లో..)

స్ఫూర్తిపతాక.. దీపిక

భారత అంధుల టీ-20 క్రికెట్ జట్టు కెప్టెన్‌కు ఘన సన్మానం
దీపిక ప్రతిభను కొనియాడిన ప్రజాప్రతినిధులు, అధికారులు
ఆమెను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచన



మాట్లాడుతున్న మంత్రి సవిత

మడకశిర/టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు అంధత్వం అడ్డుకాదని నిరూపిస్తూ, దేశం గర్వించేలా టీ-20 క్రికెట్ ప్రపంచకప్ సాధించిన దీపిక ఎందరికో స్ఫూర్తి అని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. అంధుల టీ-20 క్రికెట్‌లో భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిన కెప్టెన్ దీపికను సోమవారం మడకశిరలో ఘనంగా సన్మానించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సాధించాలి అన్న పట్టుదల ఉంటే ఎంతటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని దీపిక నిరూపించిందన్నారు. హేళనలు పట్టించుకోకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అకుంఠిత దీక్షతో దేశ చరిత్రలో తనపేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుందని ప్రశంసించారు. దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య వంటి గొప్ప వ్యక్తుల చేత మెప్పు పొందిన క్రీడాకారిణిగా దీపిక (మిగతా 6లో...)

పీజీ అడ్మిషన్లు వెలవెల

- 29 విభాగాల్లో 808 సీట్లు ఖాళీ
- తొలిరోజు 100 మంది హాజరు
- నేడు, రేపు కొనసాగనున్న ప్రక్రియ

7

రాయలసీమలో వందేమాతరం స్ఫూర్తి

● లోక్‌సభలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



అనంతపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం స్ఫూర్తి దేశంలోని సుదూర ప్రాంతాలకు సైతం చేరిందని, రాయలసీమకు, మరీ ముఖ్యంగా అనంతపురం జిల్లాకు విస్తరించిందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. దేశభక్తికి ప్రతీకగా నిలిచిన 'వందేమాతరం' జాతీయ గీతాన్ని రచించి 150 ఏళ్లు అయిన సందర్భంగా లోక్‌సభలో సోమవారం జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. రాయలసీమ ప్రాంత పోరాట స్ఫూర్తిని, వీరగాథలను ఆయన ప్రస్తావించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, పెద్దవడుగూరు, హిందూపురం ప్రాంతాలను మహాత్మా గాంధీజీ సందర్శించారని, స్వాతంత్ర్యోద్యమంలో చేరాలని ప్రజలకు పిలుపునిచ్చారని అన్నారు. 1946లో బ్రిటీష్‌వారు అనంతపురం నుంచి బళ్లారికి అటవీ సంపదను తరలిస్తుంటే.. అడ్డుకునేందుకు కొత్తపల్లి గ్రామస్థులు ఒక వంతెనను ధ్వంసం చేశారని, అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారని అన్నారు. దీనికి ఆగ్రహించిన బ్రిటీష్ ప్రభుత్వం గ్రామస్థులకు రూ.5 వేల భారీ జరిమానా విధించారని అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆ సొమ్మును భారత ప్రభుత్వం ఆ గ్రామానికి తిరిగి చెల్లించిందని, గ్రామస్థులు ఆ సొమ్ముతో ఊరిలో ప్రాథమిక పాఠశాలను నిర్మించారని, ఇది వందేమాతరం స్ఫూర్తికి నిదర్శనమని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వందేమాతరం గీతానికి ఆకర్షితులై, యుక్త వయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని వీరమరణం పొందారని, తెలుగు వారి పౌరుషం ఎలా ఉంటుందో చాటి చెప్పారని అన్నారు. వందేమాతరం ఆత్మ సామాన్య ప్రజల్లోనూ సజీవంగా ఉందని అన్నారు.

నిర్దిష్ట వ్యవధిలో పరిష్కారం: ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలకు నిర్దిష్ట వ్యవధిలోగా పరిష్కారం చూపుతామని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన పీజీఆర్ఎస్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై స్వేచ్ఛగా అర్జీలు అందించవచ్చునన్నారు. బాధితులు ఎవరైనా, దేనికీ భయపడకుండా నేరుగా పోలీస్ అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రజాసేవే ధ్యేయంగా పోలీస్‌శాఖ పని చేస్తుందన్నారు. అర్జీలకు చట్టపరిధిలో వేగంగా పరిష్కారం చూపుతామని ఆయన తెలిపారు. కాగా 128 అర్జీలను ప్రజల నుంచి వచ్చినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్‌బాషా, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి టెట్: కలెక్టర్ ఆనంద్



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, కొత్తచెరువు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10 నుంచి 21వతేదీ వరకు టెట్ నిర్వహిస్తామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం టెట్ నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశామని, సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 4,520 మంది టెట్‌కు హాజరవుతారని డీఈవో కిష్టప్ప తెలిపారు. పుట్టపర్తి, బెంగుళూరులో ఒక్కో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు గుర్తింపు కార్డులతో గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఈవో లీలలు



పాలపాటిదిన్నె ఆలయం

(5వ పేజీ తరువాయి)

పూర్తయ్యాక కూడా ఈవో సొంతంగా ఈ ఏడాది ఆగస్టు 18న చెక్కు ద్వారా రూ.2.50 లక్షలు డ్రా చేసుకున్నారు. ఆలయంలో ఖర్చులు, వస్తువుల కొనుగోళ్లకు చెక్కులు వారి పేరుతో ఇస్తారు. ఈవో మురళీక్రిష్ణ ఏకంగా రూ.2.50 లక్షలు తన పేరుతో డ్రా చేసుకున్నారు. ఆ సొమ్ము ఎందుకు ఖర్చుపెట్టారో తేలాల్సి ఉంది. ఇలాంటివి కోకొల్లలు అని ఆయా ఆలయాల సిబ్బంది పేర్కొంటున్నారు. పాలపాటిదిన్నె, ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయాల్లో భక్తులిచ్చే విరాళాల లెక్క తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలపాటిదిన్నెలో అధికారికంగా ఒక విరాళాల పుస్తకం రాస్తే, ఆలయంలో హవా నడిపిస్తున్న వైసీపీ నాయకుడు, ఈఓ సొంతంగా ముద్రించుకున్న మరో పుస్తకాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఈఓ ఎడాపెడా ఆలయ సొమ్ము ఖర్చు చేస్తున్నట్లు సమాచారం.

ఈఓ పనితీరు సరిగాలేదు



సస్పెండైన ఈవో మురళీక్రిష్ణ పనితీరు సరిగాలేదు. గతంలో ఇక్కడ పనిచేసిన ముగ్గురు ఈఓలు బాధ్యతగా ఉండేవారు. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం ఉత్సవాలపై ఎంతో నిబద్ధతతో పనిచేసేవారు. మురళీక్రిష్ణ మాత్రం తాము ఎన్నిమార్లు చెప్పినా, శ్రావణమాసం ఉత్సవాల్లో పెద్దగా స్పందించింది లేదు. రెండుమూడురోజులకోసారి అలా వచ్చి.. ఇలా వెళ్లేవారు. శ్రావణమాస ఉత్సవాలు స్థానికంగా ఉన్న సిబ్బందితోనే పూర్తి చేశాం.

- ఆంజనేయదాస్, పాలపాటిదిన్నె ఆలయ ప్రధాన అర్చకుడు

రామగిరి డీటీ అరెస్టు

అతడి తల్లిదండ్రులు కూడా..

అమూల్య, ఆమె కొడుకు మృతి కేసులో 14 రోజుల రిమాండ్

అనంతపురం క్రైం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలో కుమారుడిని చంపి అమూల్య ఉరి వేసుకున్న కేసులో ఆమె భర్త రామగిరి డిప్యూటీ తహసీల్దార్ బండమీద రవిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. గతనెల 27వ తేదీన నగరంలోని జేఎన్టీయూ రోడ్డులో గల ఇంట్లో నాలుగేళ్ల కుమారుడి గొంతు కోసి, అమూల్య ఆత్మహత్య చేసుకుంది. దీనిపై అమూల్య తండ్రి రామకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. అందులో భాగంగా అమూల్య భర్త రవి, అత్తమామలు శివాంజినమ్మ, కుళ్లాయప్పను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించింది.

రెండు రైళ్ల రద్దు

గుంతకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాలతో చర్లపల్లి-యల్హంక-చర్లపల్లి ప్రత్యేక రైళ్లను ఒక్కో ట్రిప్పు చొప్పున రద్దుపరచినట్లు రైల్వే అధికారులు సోమవారం ప్రకటనలో తెలిపారు. చర్లపల్లి-యల్హంక ప్రత్యేక రైలు (నం. 07187)ను 8వ తేదీన, యల్హంక-చర్లపల్లి ప్రత్యేక రైలు (నం. 07188)ను 9న రద్దు చేశారు. ఆపరేషనల్ రీజన్స్‌తో రద్దయిన రైళ్ల విషయాన్ని గమనించి ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

స్ఫూర్తి పతాక.. దీపిక



దీపికకు చెక్కు అందజేస్తున్న మంత్రి సవిత



దీపికకు క్రికెట్ బ్యాట్లతో గౌరవ వందనం

(5వ పేజీ తరువాయి)

నిలిచిందన్నారు. ఆమె ప్రతిభకు ప్రోత్సాహకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.10లక్షలు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు రూ.2లక్షలు, తాను రూ.2.16లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు.

కష్టపడితే ఏదైనా సాధ్యమే..: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

లక్ష్యం చేరాలనే సంకల్పం ముందు పేదరికం, దివ్యాంగత్వం వంటివి ఏవీ అడ్డురావని, కష్టపడితే సాధించలేదని ఏమీ ఉండదని నిరూపించిన క్రీడాకారిణిగా దీపిక నిలిచారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. ప్రపంచపటంలో మడకశిర పేరును నిలిపిన దీపికను మనందరం సత్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మడకశిర ప్రాంత విద్యార్థులు మరో దీపికలా విజయాలను అందుకొని ఈప్రాంతానికి కీర్తిని తీసుకురావాలని కోరారు.

రోల్ మోడల్: సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే

దీపిక అంధుల టీ-20 ప్రపంచకప్‌ను భారత్‌కు అందించి రోల్‌మోడల్‌గా నిలిచారని పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి అన్నారు. అనుకొన్నది సాధించడానికి పేదరికం, దివ్యాంగత్వం, హేళనలు అడ్డుకాదని నిరూపించిన దీపిక ఎందరి కో ఆదర్శంగా నిలిచారన్నారు. విద్యార్థులు ఆమె స్ఫూర్తిగా రాణించాలన్నారు.

మట్టిలో మాణిక్యం: సాయికుమార్, సినీనటుడు

మన మట్టిలో పుట్టిన మాణిక్యం దీపిక అని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ ప్రశంసించారు. ప్రతి విద్యార్థి దీపికను స్ఫూర్తిగా తీసుకుని రాణించాలన్నారు. మొట్టమొదటి అంధుల టీ-20 ప్రపంచకప్పును అందించి దేశం అంతా తనవైపు చూసేలా నిలిచిన గొప్ప క్రీడాకారిణి దీపిక అని అన్నారు.

ఆత్మస్థైర్యంతో..: గుండుమల, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆత్మస్థైర్యం, బలమైన విశ్వాసంతో ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ లేదని దీపిక నిరూపించిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. మడకశిర పేరును ప్రపంచస్థాయిలో పరిచయం చేసిన దీపిక ప్రతిభ ప్రశంసనీయమన్నారు. దీపికను అందరూ స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలన్నారు.

నిరంతర కృషితోనే గుర్తింపు: కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్

నిరంతరం కృషి, పోరాటం వల్ల దీపిక తాను అనుకొన్న లక్ష్యాన్ని సాధించారని కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌లు అన్నారు.

దీపిక సన్మాన సభలో వారు మాట్లాడుతూ హేళనలు ఎదురైనా నిరుత్సాహపడకుండా కలలుగన్న లక్ష్యాన్ని దీపిక చేరారని ప్రశంసించారు. ఆమె ప్రతిభ ముందు అంధత్వం కూడా చిన్నబోయిందన్నారు. ప్రతి ఇబ్బందిని అవకాశంగా మలుచుకుని నేడు భారత జట్టును ప్రపంచ విజేతగా నిలిపిందని అభినందించారు. ఇంతటి ప్రతిభాశాలి మడకశిరకు చెందిన యువతి కావడం ఇక్కడి ప్రజలకు గర్వకారణమన్నారు.

అడుగడుగునా నీరాజనం

మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలం తంబాళహట్టి గ్రామానికి చెందిన దీపిక భారత అంధుల టీ-20 జట్టు కెప్టెన్‌గా ప్రపంచకప్ సాధించి తొలిసారి సోమవారం మడకశిరకు వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో భారీ అభినందన ర్యాలీని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరారెడ్డి, సినీనటుడు సాయికుమార్‌తో కలిసి దీపిక ర్యాలీలో పాల్గొన్నారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు క్యాంప్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. రాజీవ్‌గాంధీ సర్కిల్‌మీదుగా మడకశిర జూనియర్ కళాశాల మైదానం వరకు వేలాది మంది విద్యార్థులు, క్రీడాకారుల నడుమ ర్యాలీ సాగింది. అనంతరం జూనియర్ కళాశాల మైదానంలో సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్ మహంతేష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ భక్తర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, క్రీడాకారులు

అవమానాలు, విమర్శలు అధిగమించి..: దీపిక, అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్



చిన్నప్పటి నుంచి ఎదురైన అవమానాలు, విమర్శలు నాలో పట్టుదలను పెంచాయి. దాని ఫలితమే నేటి నా విజయమని అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక అన్నారు. 2019లో కర్ణాటకలో అంధుల క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం, కోచ్ మహంతేష్ సహకారం వల్లే జాతీయ జట్టుకు సారథ్యం వహించే సామర్థ్యం వచ్చినట్లు తెలిపారు. అందరి సహకారం వల్లే మొదటిసారి జరిగిన అంధుల టీ-20 ప్రపంచకప్‌లో జట్టును విజేతగా నిలిపినట్లు పేర్కొన్నారు. కప్పు సాధించడం పట్ల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, మడకశిర ప్రాంత ప్రజలు చూపిన ఆదరణ జీవితంలో మరువలేనన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సహకారం కూడా మరువలేనన్నారు.

నో రికవరీ..!

ఆకుతోటపల్లిలో రూ.17లక్షలు స్వాహా

సొంత ఖాతాల్లోకి జమచేసుకున్న మాజీ యానిమేటర్, మరో లీడర్

పోలీసులకు ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు



వెన్నెల మండల సమైక్య కార్యాలయం

అనంతపురంరూరల్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యుల సొమ్ము స్వాహాపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అనంతపురం రూరల్ మండలంలోని ఆకుతోటపల్లి మహిళా సంఘాలకు సంబంధించిన రూ.17 లక్షలకు పైగా డబ్బును మాజీ యానిమేటర్‌తో పాటు ఓ గ్రూపు లీడరు కాజేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా సొంత ఖాతాల్లోకి జమచేసుకున్నారు. సంబంధిత అధికారుల విచారణలో కూడా వ్యవహారం బట్టబయలయింది. ఆ మేరకు సదరు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదంతా జరిగి మూడు నెలలు గడిచిపోయింది. ఇంత వరకు సొమ్ము రికవరీపై ఒక్క అడుగు ముందుకు పడలేదు. పోలీసుల తీరు అంతకంటే అధ్వానంగా ఉందని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

రూ.17.63 లక్షలు స్వాహా

ఆకుతోటపల్లిలో జనని గ్రామ సంఘం తరఫున 30, అశ్విని గ్రామ సంఘం తరుఫున 55 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలోని 8 స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన సభ్యుల సొమ్మును మాజీ యానిమేటర్ శ్రీలేఖ, ఓ సంఘం లీడర్‌గా వ్యవహరించిన షాహీదా స్వాహా చేశారు. గ్రూపు సభ్యులకు తెలియకుండా తమ సొంత ఖాతాల్లోకి రూ.17,63,800 జమ చేసుకున్నారు. ఈ సొమ్ములో రూ.7.62లక్షలు యానిమేటర్ తన వ్యక్తి గత బ్యాంకు ఖాతాకు జమ చేసుకుంది. మిగతా సొమ్మును తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు సంబంధిత అధికారుల విచారణలో బయటపడింది.

ఫిర్యాదుతో సరిపెట్టిన అధికారులు

మహిళా సంఘాలకు సంబంధించిన సొమ్ము స్వాహా వ్యవహారం ఆగస్టులో బయట పడింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు. ఆ మేరకు నిధుల స్వాహా నిజమేనని నిర్ధారించారు. సెప్టెంబరులో ఇటుకలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసి అంతటితో అధికారులు సరిపెట్టుకున్నట్లు తెలుస్తోంది. సొమ్ము రికవరీలో జరుగుతున్న జాప్యంపై మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు పోలీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను రెండు, మూడుసార్లు పోలీసులకు పట్టించినా ప్రయోజనం లేకుండాపోయిందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం యానిమేటర్, లీడర్ ఇద్దరూ పరారీలో ఉన్నారంటూ పోలీసులు చెబుతున్నారని మహిళా సంఘాల సభ్యులు అంటున్నారు. ఏమైనా మాట్లాడితే.. మీరే పట్టుకురండి అంటూ పోలీసులు మాట్లాడుతున్నారని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు



సంఘంలో తీసుకున్న అప్పులు చెల్లించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. ఇప్పుడు సంఘంలో తొమ్మిది మంది సభ్యులకు సంబంధించి రూ.4లక్షలు సొమ్మును యానిమేటర్ కాజేసింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి. సంఘాల్లో జరిగిన విషయం గురించి కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. అయినా ప్రయోజనం లేకుండాపోయింది.

-సావిత్రమ్మ, సభ్యురాలు, ఆరుణోదయ గ్రూపు

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆకుతోటపల్లిలో జనని, అశ్విని గ్రామ సంఘంలోని 8 సంఘాలల్లో రూ.17 లక్షలు దుర్వినియోగం జరిగింది. గతంలో పనిచేసిన యానిమేటర్ శ్రీలేఖ, మరో సంఘం లీడర్ షాహీదా సొంత ఖాతాల్లోకి జమ చేసుకున్నారు. దుర్వినియోగమయిన సొమ్ములో యానిమేటర్ నుంచి రూ.1.80 లక్షలు, సంఘం లీడర్ నుంచి రూ.లక్ష రికవరీ చేశాం. స్వాహాపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. బ్యాంకర్లతోనూ మాట్లాడి సంఘం సభ్యులను ఇబ్బంది పెట్టొదని కోరాం.

-రవి, ఏపీఎం

రెండు, మూడు సార్లు పట్టించాం



రాత్రిళ్లు మేలుకుని సొమ్ము కాజేసిన యానిమేటర్‌ను పట్టుకుని పోలీస్టేషన్‌కు అప్పగించాం. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంత వరకు ఒక్కరుపాయి కూడా వసూలయింది లేదు. పోలీసుల నుంచి సరైన సమాధానం లేదు. చేసేదిలేక ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశాం. న్యాయం జరిగేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు.

-రామలక్ష్మి, సభ్యురాలు, రాఘవేంద్ర గ్రూపు

సైనికుల సేవలు వెలకట్టలేనివి

కలెక్టర్ శ్యాంప్రసాద్



విద్యార్థులతో కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలను లెక్కచేయకుండా సరిహద్దులో కాపలా కాస్తున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని కలెక్టర్ శ్యాంప్రసాద్ కొనియాడారు. కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి తిమ్మప్ప ఆధ్వర్యంలో సోమవారం సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయుధ దళాల పతాక దినోత్సవాలను ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తమ వంతు విరాళాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతిపౌరుడి కర్తవ్యమన్నారు. ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, సేవాసంస్థలు విరాళాలు అందించి, సైనికుల సంక్షేమానికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కలెక్టరేట్‌లో బాల్య వివాహ ముక్త భారత్-100 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాను బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి అధికారి, స్వచ్ఛంద సంస్థ, గ్రామస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జేసీ మౌర్యభరద్వాజ్, ఆర్డీఓ సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీఈఓ కిష్టప్ప, డీసీపీఓ మహేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ మురళీధర్ పాల్గొన్నారు.

ఏమవుతుందిలే అనుకున్నారేమో..!

- ఎల్ఆర్ఎస్‌కు కొరవడిన స్పందన
- పట్టణంలో వందల అక్రమ ప్లాట్లు
- పదుల సంఖ్యలో దరఖాస్తులు
- మున్సిపల్ ఆదాయానికి భారీ గండి
- జనవరి 23తో ముగియనున్న గడువు



ఎన్జీవో కాలనీ సమీపంలోని లేఅవుట్‌లో రాళ్లను తొలగిస్తున్న ఎక్స్‌కావేటర్ (ఫైల్)

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ సిస్టమ్)కు స్పందన కొరవడింది. వందల సంఖ్యలో ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు పదుల సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ప్లాట్ల రెగ్యులరైజ్ చేసుకోవడానికి 2026 జనవరి 23 వరకు సమయం ఇచ్చింది. ఇందుకోసం ప్రభుత్వం అనేక రాయితీలు కూడా ప్రకటించింది. గతంలో ఉన్న 14 శాతం చార్జీలను 7శాతానికి తగ్గించింది. దీంతో పన్నులు కట్టే వాటిలో కూడా 5శాతం రాయితీని ప్రకటించింది. మొత్తం మీద సగం ధరకే ప్లాట్లు రెగ్యులరైజ్ అయ్యే అవకాశముంది. అయితే అక్రమ లేఅవుట్లు వేసిన యజమానుల నుంచి స్పందన కొరవడింది. అధికారులు మొద్దునిద్రలో ఉండటంతో ఎల్ఆర్ఎస్ ద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది.

స్పందించని అక్రమార్కులు

పట్టణంలో వందల సంఖ్యలో క్రమబద్ధీకరణకు నోచుకోని ప్లాట్లు ఉన్నాయి. ప్రభుత్వం 2020లో క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో 218మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనిద్వారా మున్సిపాలిటీకి రూ.1.32 కోట్ల ఆదాయం వచ్చింది. 2025లో మరోసారి ఎల్ఆర్ఎస్‌కు ప్రభుత్వం అనుమతించింది. 78 లేఅవుట్లలో అనుమతి లేని ప్లాట్లు ఉన్నాయి. వాటిని రెగ్యులరైజ్ చేసుకోవాలి. ఇప్పటివరకు 37 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వాటి ద్వారా రూ.23లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అక్రమ లేఅవుట్ల వల్ల మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. పట్టణ పరిధిలో దాదాపు 13వందల ప్లాట్ల వరకు రెగ్యులరైజ్ కావాల్సి ఉంది. ఇవన్నీ రెగ్యులరైజ్ అయితే మున్సిపాలిటీకి రూ.5కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు

మున్సిపల్ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతున్నా, అధికారులు మాత్రం మొద్దు నిద్రను వీడకుండా ఉన్నారు. ఎల్ఆర్ఎస్ గురించి ఏమాత్రం ప్రచారం చేయడం లేదు. అక్రమ లేఅవుట్లు వేసిన యజమానులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాని విషయం. అక్రమ లేఅవుట్లలో ఉన్న ప్లాట్లకు రిజిస్ట్రేషన్, ఈసీ ప్లాన్ మంజూరు చేయకూడదని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఇదివరకే అధికారులను గట్టిగా హెచ్చరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా రియల్టర్లు, ప్లాట్లు కొన్నవారితో సమావేశం నిర్వహించారు. కొంతమంది రియల్ ఎస్టేట్ పేరుతో మాయమాటలు చెప్పి ప్లాట్లు అమ్మేశారని అప్పుడే చెప్పారు. రెగ్యులరైజ్ చేసుకోవాలంటే లేఅవుట్ మొత్తం చేసుకోవాలని తెలిపారు. దీంతో అక్రమార్కులు తమ మోసపు వ్యాపారాలను నిలిపివేశారు. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతించినా, వీరు ముందుకు రాకపోవడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుకే ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు అక్రమ లేఅవుట్లు వేసినవారిపై వత్తిడి తెచ్చి రెగ్యులరైజేషన్ చేయించేలా ఒత్తిడి తేవాలని ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.

చర్యలు తప్పవు: కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు గడువులోపు క్రమబద్ధీకరించుకోవాలి. అలా చేయకపోతే చర్యలు తప్పవు. ఫిబ్రవరి వరకు అక్రమ లేఅవుట్లలో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడానికి అవకాశముంది. ప్రతి ఒకరు రెగ్యులరైజ్ చేసుకోవాలి. స్థల యజమానులకు అవగాహన కోసం వివిధరకాల పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నాం.

క్రైం కార్నర్

ఊడిన స్కూల్ బస్సు చక్రం

● విద్యార్థులకు తప్పిన ప్రమాదం



టైరును తోసుకుంటూ వస్తున్న పాఠశాల విద్యార్థులు

కళ్యాణదుర్గం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మగానిపల్లి పరిసర ప్రాంతంలో సోమవారం ఉదయం ఓ ప్రైవేటు స్కూలు బస్సు వెనుక చక్రం ఊడిపోయింది. అయితే బస్సులోని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన చైతన్య టెక్నో స్కూలు బస్సు సోమవారం ఉదయం విద్యార్థులను తీసుకుని పాఠశాలకు బయల్దేరింది. మార్గమధ్యలో వెనుక చక్రం ఊడిపోయింది. ఆ సమయంలో బస్సులో 35 మంది విద్యార్థులు ఉన్నారు. చక్రం ఊడిపోయిన విషయం గమనించని డ్రైవర్ బస్సును అలాగే ముందుకు పోనిచ్చాడు. అయితే పిల్లలు గమనించి కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును ఆపాడు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు. కండిషన్‌లో లేని బస్సులు తిప్పడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఊడిన చక్రాన్ని విద్యార్థులే రోడ్డుపై దొర్లించుకుంటూ బస్సు వద్దకు తీసుకొస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

అమ్మ కాలేక...!

● ఆత్మహత్య చేసుకున్న మహిళ



మృతిచెందిన ప్రశాంతి

సోమందేపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అమ్మతనం కోసం ఎంతగా పరితపించిందో ఏమో ఆ ఇల్లాలు..? పిల్లలు కలగాలని ఉదయమే భర్తతో కలిసి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడికి వెళ్లి పూజలు చేసింది. తర్వాత నవ్వుతూ భర్తను పనికి సాగనంపింది. తర్వాత తన తల్లికి ఫోన్ చేసి సంసార బాధల గురించి ఆవేదన వ్యక్తం చేసింది. కుమార్తె మాటలతో కంగారు పడిన ఆ తల్లి పరుగు పరుగున బిడ్డ ఇంటికి చేరుకుంది. తలుపు తీసి విగతజీవిగా పడి ఉన్న బిడ్డను చూసి బోరున విలపించింది. ఈ సంఘటన మండలంలోని మండ్లి గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసులు, బంధువుల కథనం మేరకు మండలంలోని చాలకూరుకు చెందిన ప్రసాద్, జయమ్మ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె ప్రశాంతి(25)ని మూడేళ్ల కిందట మండ్లి గ్రామానికి చెందిన మారుతికి ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లపాటు వీరి కాపురం అన్యోన్యంగా సాగింది. తర్వాత సంతానం కలుగలేదని కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతి తల్లిదండ్రులు అత్తింటివారికి నచ్చచెప్పి కూతురిని పలు ఆస్పత్రుల్లో చూపించారు. ఈ క్రమంలోనే అత్తమామల పోరు పడకలేక భర్తతో కలిసి ప్రశాంతి ఎనిమిదిరోజుల కిందట వేరు కాపురం పెట్టింది. ఇంతలో ఏం జరిగిందో ఏమో సోమవారం ఉదయం ప్రశాంతి ఇంట్లోనే ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తమ కుమార్తెను అత్తింటివారే వేధించి ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని ప్రశాంతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి, శోధించారు. మృతురాలి భర్తను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని ప్రశాంతి మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎర్రదొడ్డి ఆలయ ఈవో అరెస్టు

5.573 కిలోల వెండి, 15 చీరలు, 1.980గ్రాముల బంగారం స్వాధీనం



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణ స్వామి

కదిరి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడిన ఈవో మురళీక్రిష్ణను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 5.573 కేజీ వెండి ఆభరణాలు, 1.980గ్రా. బంగారం, 15 చీరలు స్వాధీనం చేసుకున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. వాటి విలువ రూ.6.23 లక్షలు ఉంటుందన్నారు. పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈవో మురళీక్రిష్ణ ఈనెల 7న ఉదయం 11 గంటలకు అనుమతులు లేకుండా ఆలయంలోని ఆభరణాలు, చీరలు ఆటోలో తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు పోలీసులు ఆలయ ఈఓ నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. విషయాన్ని దేవదాయ శాఖాధికారులకు తెలపగా, హిందూపురం దేవదాయ శాఖ తనిఖీ అధికారి ప్రసాద్ వచ్చి విచారణ చేసి, కదిరి రూరల్ యూపీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఈవో మురళీక్రిష్ణపై కేసు నమోదు చేశారు. ఈనెల 7వతేదీ రాత్రి 10 గంటలకు మురళీక్రిష్ణను సీఐ నిరంజన్‌రెడ్డి అరెస్టు చేశారు. రెండు ప్లాస్టిక్ సంచుల్లోని ఆభరణాలు, చీరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈవో సెల్‌ఫోన్‌తోపాటు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఇళ్లకూడా స్వాధీనం చేసుకోనున్నట్లు డీఎస్పీ చెప్పారు. చోరీ వ్యవహారంలో ఈఓతోపాటు వైసీపీ నాయకుడి హస్తం ఉందా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు డీఎస్పీ సమాధానమిస్తూ.. లోతుగా విచారిస్తున్నామనీ, త్వరలో వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో సీఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో ఆరుగురు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 3,5 సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు డీబార్ అయినట్లు ఎస్కేయూ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నగరంలోని ఎస్ఎల్ఎన్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ధర్మవరం వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, గుత్తి ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ఒకరు చొప్పున మొత్తం ఆరుగురు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.31

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.31తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠంగా రూ.14తో, సరసరిగా రూ.20తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

14న రగ్బీ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అశ్మిత్ రగ్బీ మహిళా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 14న గుంటూరులోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు అశ్మిత రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కడపల శంకర్ తెలిపారు. అండర్-15 బాలికల కేటగిరీకి 2010-11 సంవత్సరంలో జన్మించి ఉండాలని, అండర్-18 బాలికల విభాగంలో 2007-08 సంవత్సరాల మధ్య, సీనియర్ మహిళల విభాగానికి 2000 నుంచి 2007 సంవత్సరాల మధ్య జన్మించిన క్రీడాకారిణులు అర్హులన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారిణులు ఈనెల 27, 28వతేదీలలో చెన్నైలో జరిగే సౌత్‌జోన్ నేషనల్ అశ్మిత్ రగ్బీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ పేర్ల నమోదు, మరిన్ని వివరాలకు పీడీ నాగరాజు సెల్ నంబరు 8341411083ను సంప్రదించాలని కోరారు.

పీజీ అడ్మిషన్లు వెలవెల

● 29 విభాగాల్లో 808 సీట్లు ఖాళీ
● తొలిరోజు 100 మంది హాజరు
● నేడు, రేపు కొనసాగనున్న ప్రక్రియ



విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పీజీ మిగులు సీట్లకు నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లకు స్పందన అంతంత మాత్రమే కనిపించింది. తొలిరోజు సోమవారం ఉదయం 10 గంటలకు వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్, వైస్ ప్రిన్సిపాల్ మునినారాయణప్ప ఆధ్వర్యంలో అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టారు. అనుకున్న స్థాయిలో విద్యార్థులు అడ్మిషన్లకు ఆసక్తి చూపలేదు. 29 విభాగాల్లో మొత్తం 808 ఖాళీలు ఉన్నట్లు అధికారులు చూపినప్పటికీ... 100 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులోనూ ఒక్కో విభాగానికి ఇద్దరేసి చొప్పున విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. ఏ విభాగంలో ఎంతమంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారోనన్న దానిపై స్పష్టత రాలేదు. అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్‌ను వివరణ కోరగా.. 100 మంది అడ్మిషన్లకు హాజరయ్యారని తెలిపారు. కొంత మంది ఫీజులు చెల్లించారని, తర్వాత చెల్లిస్తామని మరికొందరు చెప్పారని తెలిపారు.

ఒక్కో విభాగంలో ఒకరిద్దరే..

పీజీ మిగులు సీట్లకు నిర్వహించిన స్పాట్ అడ్మిషన్లలో ఒక్కో విభాగంలో ఒకరిద్దరు మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. మొత్తం 29 విభాగాల్లో 808 సీట్లు ఖాళీలు ఉన్నప్పటికీ విద్యార్థులు పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ఏ విభాగంలో ఎంత మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారన్న సమాచారాన్ని అధికారులు వెల్లడించలేదు. సంబంధిత విభాగం నుంచి అందిన సమాచారం మేరకు...కొన్ని విభాగాల్లో అడ్మిషన్లను పరిశీలిస్తే... ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో 29 ఖాళీలు ఉండగా.. ముగ్గురు, ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రక్షన్స్ విభాగంలో 26 ఖాళీలుండగా... ఇద్దరు, జాగ్రఫీలో 20 సీట్లుండగా... ఒకరు, మేథమేటిక్స్‌లో 24 సీట్లు ఉండగా.. ఒకరు, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీలో 17 సీట్లుండగా.. ఒకరు, సెరికల్చర్‌లో 11 సీట్లుండగా.. ఇద్దరు, జువాలజీలో 15 సీట్లుండగా ముగ్గురు హాజరైనట్లు సమాచారం. అదే విధంగా ఎంకామ్‌లో 42 సీట్లుండగా.. ఐదుగురు, ఎంపీఈడీలో 34 సీట్లుండగా... ఒకరు, ఎంఎల్ఐఎస్సీలో 30 సీట్లుండగా.. 9 మంది వచ్చినట్లు తెలుస్తోంది. ఎంఎస్‌డబ్ల్యూలో 32 సీట్లు ఉండగా... నలుగురు మాత్రమే అడ్మిషన్లు పొందారు. ఇక ఎమ్మెస్సీ అప్లైడ్ మేథమేటిక్స్‌లో 26 సీట్లు, మైక్రోబయాలజీలో రెండు సీట్లు, ఫిజిక్స్‌లో 42 సీట్లు, స్టాటిస్టిక్స్‌లో 14 సీట్లు, ఎంకామ్(ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్)లో 50 సీట్లుండగా ఒక్కరంటే ఒక్కరు కూడా అడ్మిషన్లు పొందకపోవడం గమనార్హం. మిగిలిన విభాగాల్లోనూ ఆరేడు లోపు అడ్మిషన్లు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే యూనివర్సిటీ అధికారులు అడ్మిషన్ల జాబితాను బయటపెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నేడు, రేపు అడ్మిషన్లు..

మిగులు సీట్లకు సంబంధించి తొలి రోజు 100 మంది హాజరయ్యారు. అనుకున్న స్థాయిలో స్పందన లేకపోవడంతో అడ్మిషన్ల ప్రక్రియను మంగళ, బుధవారాల్లో కొనసాగిస్తున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్ తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయండి: కలెక్టర్



ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు అందజేస్తున్న కలెక్టర్, డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పల్స్‌పోలియో కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈబీ దేవి అధ్యక్షతన పల్స్ పోలియోపై కలెక్టర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమానికి జిల్లాలోని 1785 పోలింగ్ బూత్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,84,774 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయాలన్నారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసేలా గ్రామాలు, పట్టణాలు, పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 24 మంది అనాథపిల్లలకు హెల్త్‌కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రోగ నిరోధక విభాగ అధికారి డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, వ్యాక్సినేషన్ మేనేజర్ రాజు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎన్టీఆర్ వైద్యసేవ డీసీ గంగాధర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రి, ఎల్డీఎం నరేష్ రెడ్డి, డీపీఓ నాగరాజనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, హార్టికల్చర్ డీడీ ఉమాదేవి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, టూరిజం జయకుమార్, పీఆర్ఎస్ సుబ్బరాయుడు, సివిల్ సప్లై డీఎం రమేష్‌రెడ్డి, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై వేటు

కొత్తచెరువు/మడకశిర రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరసింహమూర్తిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప సోమవారం ప్రకటనలో తెలిపారు. మడకశిర మండలం హరేసముద్రం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరసింహమూర్తి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేయగా.. వాస్తవమేనని తేలడంతో నరసింహమూర్తిని సస్పెండ్ చేశామన్నారు. పోక్సో కేసు నమోదు చేసేలా ఫిర్యాదు చేయాలని మండల విద్యాశాఖాధికారికి సూచించామని డీఈఓ తెలిపారు.

శిక్షణకు కుష్బూ కొఠారి

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖ రెగ్యులర్ డీడీగా, ఎస్సీ సంక్షేమానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కుష్బూ కొఠారి నాలుగురోజులపాటు నోయిడాలో శిక్షణకు ప్రభుత్వం తరఫున ఆదివారం రాత్రి వెళ్లారు. ఆ తర్వాత వారంపాటు వ్యక్తిగత పనిమీద సెలవుకు దరఖాస్తు చేసుకోగా.. కలెక్టర్ ఆనంద్ ఆమోదం తెలిపారు. దీంతో కుష్బూకొఠారి ఈనెల 21 వరకు విధులకు దూరంగా ఉంటారు. ఈనేపథ్యంలో మైనార్టీ సంక్షేమ శాఖ డీడీగా, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా కొనసాగుతున్న రామసుబ్బారెడ్డికి బీసీ సంక్షేమ శాఖ డీడీగా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఎస్సీ సంక్షేమ ఇన్‌చార్జి బాధ్యతలను గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావుకు అప్పగిస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కుష్బూకొఠారి విధులకు హాజరయ్యేవరకు ఈ ఇద్దరు ఆయాశాఖల బాధ్యతలను చేపట్టనున్నారు.

ఎంపీడీఓలు కూడా..

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలువురు ఎంపీడీఓలు సోమవారం శిక్షణకు వెళ్లారు. శ్రీకాళహస్తిలో వీరు ఐదు రోజులపాటు శిక్షణకు హాజరుకానున్నారు. ఆ మేరకు జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓ వెంకటసుబ్బయ్య ఉత్తర్వులు జారీ చేశారు. మండలాల్లో ఇబ్బందులు లేకుండా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, శిక్షణకు ఎంపికైన ఎంపీడీఓలు వెంటనే రిలీవ్ అయి, వెళ్లాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. డిప్యూటీ ఎంపీడీఓలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, ఎంపీడీఓలు రిలీవ్ అయి వెళ్లిపోయారు. నార్పల, గుత్తి, రాయదుర్గం, పెద్దపప్పూరు, కంబదూరు, బుక్కరాయసముద్రం, రొళ్ల, గుడిబండ, తాడిమర్రి ఎంపీడీఓలు మమతాదేవి, ప్రభాకర్, కొండన్న, రత్నాబాయి, సూర్యనారయణ, సాల్‌మాన్, నాగేశ్వర శాస్త్రి, కేశవరెడ్డి, వెంకటరంగారావు శిక్షణకు వెళ్లారు.

ఇద్దరు రైల్వే ఉద్యోగులకు అవార్డులు



కీమన్ వెంకోబాకు అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించిన ఇద్దరు రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సోమవారం మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రదానం చేశారు. రైల్ ట్రాక్‌కు వేసిన మట్టికట్ట దెబ్బతినడంతో కీ మ్యాన్ వెంకోబా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. అలాగే ట్రాక్ పగుళ్లిచ్చిన విషయాన్ని కనిపెట్టిన ట్రాక్ మెయింటెనర్ బికాస్ కుమార్ సమాచారాన్ని అధికారులకు చేరవేశారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదాలు జరక్కుండా నివారించారు. విధి నిర్వహణలో చురుగ్గా వ్యవహరించిన ఈ ఇద్దరు ఉద్యోగులను సోమవారం డీఆర్ఎం తన కార్యాలయానికి పిలిపించి మ్యాన్ ఆఫ్ ది మంత్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు.

తెరుచుకున్న పీఏబీఆర్ గేట్లు

కూడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) గేట్లు మరోసారి తెరుచుకున్నాయి. సోమవారం సాయంత్రం మూడు గేట్లను ఎత్తి 620 క్యూసెక్కుల నీటిని మిడ్ పెన్నార్ డ్యాంకు వదిలారు. డ్యాంలో నీటి మట్టం 435.500 మీటర్ల వద్దకు చేరింది. 5.214 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్‌కు 730 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. కుడికాలువకు 770 క్యూసెక్కులు వదులుతున్నారు. విద్యుదుత్పత్తికి 110 క్యూసెక్కులు వాడుతున్నారు. గేట్ల ద్వారా 620 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,500 ఔట్ ఫ్లో వెళ్తోంది.

తెగిన కాలువను పరిశీలించిన ఎస్ఈ

● మరమ్మతులకు రూ.90 లక్షల అంచనా ● కుడికాలువ గేటు దించేందుకు యత్నం

కూడేరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లి సమీపంలో 4.200 కిలోమీటర్ వద్ద తెగిన పీఏబీఆర్ కుడి కాలువ ప్రదేశాన్ని సోమవారం ఇరిగేషన్ శాఖ ఎస్ఈ సుధాకర్ రావు, డీఈ విశ్వనాథ్‌రెడ్డి, ఏఈ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఇటీవల కుడికాలువ అత్యవసర గేటును అతి కష్టం మీద పైకి ఎత్తారు. గేటుకు ఉన్న రబ్బర్లు తెరుచుకుని.. 750 క్యూసెక్కుల వరకు నీరు రావడంతోనే కాలువ తెగిపోయిందని తెలుస్తోంది. ప్రస్తుతం కుడికాలువ ద్వారా 550 నుంచి 600 క్యూసెక్కుల వరకు నీరు బయటకు వస్తుండడంతో మిడ్ పెన్నార్ డ్యాంకు మళ్లించారు. తెగిన కాలువకు తక్షణం ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించడంతో ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. రూ.90 లక్షల వ్యయంతో కాంక్రీట్ పనులు చేయాల్సి వస్తుందని అంచనాలు సిద్ధం చేస్తున్నారు. ఇదే విషయాన్ని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎస్ఈ సుధాకర్‌రావు సమాచారం పంపినట్లు తెలిసింది. అంచనాలు సిద్ధం చేస్తున్నామని, నిధులు విడుదలయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని డీఈ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల్లో పనులు పూర్తి చేసి యథావిధిగా కాలువకు నీటిని సరఫరా చేస్తామని వివరించారు.

● రెండు రోజుల్లో కుడికాలువ గేటు బంద్

జల్లిపల్లి గ్రామ సమీపంలో కాలువ తెగిపోవడంతో డ్యాం నుంచి వస్తున్న నీటిని మిడ్ పెన్నార్ డ్యాంలోకి మళ్లించారు. కుడికాలువ పనులు పూర్తి కావడానికి వారం రోజులకు పైగా పట్టే అవకాశం ఉండటంతో గేట్లను బంద్ చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. గతంలో హోస్పేట్‌కు చెందిన ఆనంద్‌రాజ్, కర్నూలుకు చెందిన శ్రీనివాసులు బృందం సంయుక్త కార్యాచరణతో కుడికాలువ గేట్లు పైకి లేపారు. ప్రస్తుతం కుడికాలువ తెగిపోవడంతో తిరిగి గేటు కిందికి దించేందుకు ఆ రెండు బృందాలకు ఇరిగేషన్ అధికారులు సమాచారం పంపారు. శ్రీనివాసులు బృందం సభ్యులు గేట్లు దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండ్రోజుల్లో గేటు కిందికి దించే ప్రక్రియ ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



తెగిన కాలువ గట్టును పరిశీలిస్తున్న ఎస్ఈ సుధాకర్‌రావు



ఏఎంసీ మెప్మా కార్యాలయంలో కిక్కిరిసిన దరఖాస్తుదారులు

స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌కు డిమాండ్

● 3వేలకు పైగా దరఖాస్తులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్ ఏర్పాటుకు డిమాండ్ పెరిగింది. నగరపాలక సంస్థ మెప్మా ఆధ్వర్యంలో త్వరలో బళ్లారి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ప్రారంభించనున్నారు. వీధి వ్యాపారుల జీవనోపాధి కోసం వీధి విక్రయదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి దరఖాస్తులు కోరారు. స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌లో వంద షాపులను ప్రారంభించనున్నారు. వంద షాపులకు గాను మూడు వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒకే ప్రదేశంలో అన్ని రకాల వస్తువులు అందుబాటులోకి తీసుకువచ్చే ఒరవడికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పెద్ద నగరాలకే పరిమితమైన స్మార్ట్ స్ట్రీట్ మార్కెట్‌ను నగరవాసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటి వరకు మూడువేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు.

విపత్తులను ఎదుర్కొంటాం: డీజీ



మాట్లాడుతున్న డీజీ పీవీ రమణ

పెనుకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్తులనయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీ) పీవీ రమణ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 52 మంది గజ ఈతగాళ్లకు సోమవారం పెనుకొండలో నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ మీడియాతో మాట్లాడుతూ.. 26 జిల్లాల నుంచి అగ్నిమాపకశాఖకు సంబంధించిన నైపుణ్యం కలిగిన 52 మందిని గుర్తించామని తెలిపారు. వీరికి మూడు రోజులపాటు ఈ ప్రాంతంలో శిక్షణ ఇచ్చిన అనంతరం ఆయా జిల్లా అగ్నిమాపక కేంద్రాల్లో తిరిగి శిక్షణ ఇస్తారని అన్నారు. శిక్షణ పూర్తిచేసిన 52 మందిలో తిరిగి 26 మందిని ఎంపిక చేసి విజయవాడలో కఠిన శిక్షణ ఇస్తామని తెలిపారు. 2026 జూన్‌కు ప్రతి జిల్లాకు రెస్క్యూ టీంను సిద్ధం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో రీజినల్ ఫైర్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మాధవనాయుడు పాల్గొన్నారు.

కియకు పటిష్ఠ భద్రత: ఆక్టోపస్ డీఎస్పీ



భద్రతా దళాలతో స్థానిక పోలీసులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కియ సంస్థలోకి చొరబాటుదారులు రాకుండా అడ్డుకునేందుకు పటిష్ఠమైన భద్రత చర్యలు తీసుకున్నట్లు ఆక్టోపస్ డీఎస్పీ జగ్గనాయుడు తెలిపారు. ఆక్టోపస్ ఆధ్వర్యంలో కియ సంస్థలో 'ఆపరేషన్ ఫాల్కన్' పేరిట సోమవారం మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. సంస్థ సెక్యూరిటీ, సిబ్బందికి రక్షణ కల్పిస్తూ భద్రత దళాలు మాక్ డ్రిల్‌ను నిర్వహించాయి. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చొరబాటుదారులను న్యూట్రలైజ్‌చేసి వారి చేతిలో బందీలుగా ఉన్నవారిని సురక్షితంగా రక్షించే చర్యలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కియ సీఎస్ఓ మధుసూదన్, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ నవీన్‌చంద్, వెంకటేష్, పార్థసారథి, ఎస్ఐలు రాజేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో అంతర్జాతీయ పతకం

● సత్తాచాటిన కొత్తచెరువు వాసి చంద్రప్రియ



కోచ్‌లతో కలిసి పతకాన్ని చూపుతున్న చంద్రప్రియ

కొత్తచెరువు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా కొత్తచెరువుకు చెందిన అప్పన్నగారి చంద్రప్రియ అంతర్జాతీయ పతకాన్ని సాధించి సత్తాచాటారు. ఈనెల 6,7 తేదీలలో బ్యాంకాక్‌లో జరిగిన అంతర్జాతీయ ఏషియన్‌స్థాయి గ్రాఫ్ లింగ్ రెజ్లింగ్ పోటీలలో పాల్గొని బ్రాంచ్ మెడల్ సాధించినట్టు రెజ్లింగ్ గ్రాఫ్ లింగ్ కార్యదర్శి సాయిలీల, కోచ్ మురళీకృష్ణ తెలిపారు. హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ, అయోధ్యలో జరిగిన జాతీయ స్థాయిలో పోటీల్లోనూ సత్తాచాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయింది. ఈనెల 6న భారతదేశం జట్టు తరఫున చంద్రప్రియ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బ్రాంచ్ మెడల్ కైవసం చేసుకుందని కోచ్‌లు తెలిపారు. చంద్రప్రియ మెడల్ సాధించడతో భారతీయ రెజ్లింగ్ గ్రాఫ్‌లింగ్ అసోసియేషన్, ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. చంద్రప్రియ సాధారణ కుటుంబంలో జన్మించి అంచలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిందని పలువురు ప్రశంసిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్ సాధించడంతో చంద్రప్రియను కొత్తచెరువులో పలువురు అభినందించారు.

12న గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఈనెల 12వతేదీ రెండో విడతలో 29 ప్రాథమిక గొర్రెల సహకార సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతలో 20, సత్యసాయిలో 9 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన స్థానిక వెటర్నరీ డాక్టర్లను ఎన్నికల అధికారులుగా నియమించారు.

ఉపాధి పనులకు కూలీలను పెంచండి

- రోజుకు 80వేల మంది వచ్చేలా చర్యలు చేపట్టండి
- సమీక్షలో అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం రోజుకు 16,992 మంది కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారని, అలా కాకుండా వారి సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఆయన జేసీ శివనారాయణ్ శర్మతో కలిసి పలు అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, ఎస్డీసీలు, తహసీల్దార్లు తదితరులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్‌లో వినతుల ద్వారా వచ్చే సమస్యల పరిష్కారం పట్ల ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తహసీల్దార్ స్థాయిలోనే కేసులను పరిష్కరించాలన్నారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, అక్కడ ఓ వ్యక్తిని కంప్యూటర్‌తో కూర్చోబెట్టి ఏ ఫిర్యాదు వచ్చినా రిజిస్టర్ చేయాలని, అర్జీదారుడికి ఏ సమస్య ఉన్నా సహకారం అందించి, స్పష్టంగా తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి కూలీల శాతం పెంచాలన్నారు. జిల్లావ్యాప్తంగా రోజుకు 75 నుంచి 80 వేల మంది వచ్చేలా చూడాలన్నారు. అలాగే ప్లాంటేషన్, పల్లెవనాలు, ఇతర ప్లాంటేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సంబంధించి పూర్తయ్యే దశలో ఉన్న 44 భవనాల నిర్మాణాన్ని 15రోజులకు పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు.ఇక ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డు ఉండాలన్నారు. చెత్తను 24గంటల్లోపు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ సలీమ్‌బాషా, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఎన్టీఆర్ వైద్యసేవ కోఆర్డినేటర్ గంగాధర్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చేతకాని దద్దమ్మ

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపాటు



క్యాంపు కార్యాలయంలో ప్రజలతో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేతకాని దద్దమ్మ అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మండిపడ్డారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయానికి సోమవారం వచ్చిన వివిధగ్రామాల ప్రజలతో ఆమె, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడారు. ప్రజలు పలు సమస్యల్ని వారికి విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తర్వాత రీన్యూ కంపెనీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు సహకారం అందించాలని కోరారు. తర్వాత మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలా మాట్లాడ్డానికి సిగ్గుగా లేదా అంటూ మండిపడ్డారు. సొంత మండలంలో సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసే అవకాశం ఉన్నా చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సొంత గ్రామంలోని రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోలేదన్నారు. తాము సబ్‌స్టేషన్లు నిర్మిస్తే.. వాటిని ఆయన మా హయాంలోనే నిర్మించామని చెప్పుకోవడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదాపడ్డానికి ప్రకాష్‌రెడ్డే కారణమన్నారు. ఎంపీపీ లేక... మండలంలో చేయాల్సిన పనులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. తాము దౌర్జన్యం చేస్తున్నట్టు ఆయన విమర్శలు చేస్తున్నారని, తాము దౌర్జన్యం చేయాలనుకుంటే... వాటిని ఆపే శక్తి ప్రకాష్‌రెడ్డికి లేదని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక జరగాలని తాము భావించామని, ఆయనకు చేతకాక చేతగాని మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా ఇలాంటివి మానుకోవాలంటూ ఆమె హితవు పలికారు.

చంద్రబాబుతోనే క్రైస్తవుల అభ్యున్నతి

- టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటె స్వామిదాస్

అనంతపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే క్రైస్తవుల అభ్యున్నతి సాధ్యమని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ అన్నారు. స్థానిక సోమనాథ్‌నగర్‌లోగల సిలోయం ఏజీ చర్చిలో సోమవారం ముందస్తుగా క్రిస్మస్ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్వామిదాస్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి లోన్లు, విదేశీ విద్య, పాస్టర్లకు గౌరవ వేతనం, జెరూసలేం యాత్ర వంటి వాటిని అమలు చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు క్రైస్తవులకోసం పాటు పడటం ఆనందదాయకమన్నారు. సంక్షేమ పథకాలను ప్రతి క్రైస్తవుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ హానరబుల్ ప్రెసిడెంట్ రెవరెండ్ తిమోతిరావు, పాస్టర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యేషయా, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి వరప్రసాద్, డేనియల్, రెవరెండ్ నెహమ్యా నాయక్, ఎస్‌బీ సచార్ తదితరులు పాల్గొన్నారు.

పీవీకేకేలో ఏఐపై సాంకేతిక శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో గల పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐబీఎం స్కిల్‌బిల్డ్ ప్రోగ్రాం ఆన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై సాంకేతిక శిక్షణ నిర్వహించారు. ఐబీఎం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, ఐటీసీ అకాడమీ కార్పొరేట్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వహిదా పర్వీన్, కళాశాల ప్లేస్‌మెంట్స్ డీన్ భానుకిరణ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..భవిష్యత్తులో ఇంజనీరింగ్‌లోని అన్ని విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ కీలక భూమిక పోషించనుందని తెలిపారు. తర్వాత ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వహిదా పర్వీన్ ఏఐపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీటీ అకాడమీ రీజినల్ మేనేజర్ ప్రవీణ్, ట్రైనర్ నిధిన్‌శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ'

అనంతపురంరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆశాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతినెలా రెండవ, మూడవ మంగళవారాల్లో జరుగుతుందన్నారు. ప్రజలు విద్యుత్ సమస్యలు, ఫిర్యాదులు ఉంటే తెలియజేయవచ్చునన్నారు. ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. 08554272943, 9154790350ను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించండి

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు కోరారు. ఈమేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేవని, గతంలో మన బడి-మన భవిష్యత్తు కింద మంజూరైనవి నిర్మాణ దశలోనే నిలిచిపోయాయని తెలిపారు. అదేవిధంగా కాంపౌండ్ గోడ కూలిపోయిందన్నారు. రెండు అదనపు గదులు నిర్మాణంలో ఆగిపోయాయన్నారు. వాటిని పరిష్కరించాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద అంగన్వాడీల నిరసన

అనంతపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ వర్కర్లు నిరసన చేపట్టనున్నట్లు సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేంద్రకుమార్ తెలిపారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వేతనాలను గణనీయంగా పెంచాలని డిమాండ్‌తో నిరసన చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, ప్రధాన కార్యదర్శి రమాదేవి, కోశాధికారి కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడి నియామకం



మలోబులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జరిపోతుల మలోబులు (శివ) నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా అనంతపురం నగరానికి చెందిన జరిపోతుల మలోబులును నియమించారు. ఇందుకు మలోబులు బీజేపీ రాష్ట్ర నేతలకు, జిల్లా నాయకులకు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ కేసులు పెడితే ఊరుకోం: ఏఐటీయూసీ



ర్యాలీ చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, అంబులెన్స్ డ్రైవర్లు

అనంతపురం విద్య, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం వచ్చిన అంబులెన్స్‌డ్రైవర్లను పోలీసులు అక్రమ కేసులు పెడతామని బెదిరించడం సబబు కాదని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. అంబులెన్స్ డ్రైవర్లకు సోమవారం వారు మద్దతుగా నిలిచి వారితో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఎస్పీ ఆఫీస్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆ ఆఫీస్ ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. నాయకులు రాజారెడ్డి, రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ తమకు న్యాయం చేయాలని, రక్షణ కల్పించాలని అంబులెన్స్ డ్రైవర్లు కోరితే.. సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి పోలీసులు వారిని స్టేషన్‌కు పిలిపించి కేసులు పెడతానని బెదరించడం దారుణమన్నారు. అక్రమ కేసులు పెడితే ఊరుకునేదిలేదన్నారు. దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణుడు, చిరంజీవి, రాజు, కృష్ణానాయక్, దుర్గాప్రసాద్, ప్రవీణ్, షెక్షావలి, నవీన్, రవి, బద్రీ, గోపాల్ తదితరులుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు

అనంతపురం టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరం, మూడో రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గణనాథుని విగ్రహాలకు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతో పాటు గరిక, కుడుముల మాలలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.



మూడోరోడ్డు షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో గణపతి

కలెక్టర్‌ను కలిసిన ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

అనంతపురం అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రవీంద్ర కలెక్టర్ ఆనంద్‌ను కలిశారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు .దివాకర్, తిరుపతి అధ్యక్షుడు దేవరాజు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి, దివ్యాంగులు

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సీఎం చంద్రబాబు ఏడు వరాలను ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణంతో పాటు మరో ఆరింటిని సీఎం తాజాగా ప్రకటించారు. దీంతో సోమవారం జిల్లా కేంద్రంలో దివ్యాంగులు ఆనందంతో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం నుంచి టవర్‌క్లాక్‌వరకు ర్యాలీని కొనసాంచారు. అక్కడ సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులు బ్రహ్మ, గంగన్న, లక్ష్మీనరసింహ, గంగానాయుడు, సుధాకర్, మాబు, కుళ్లాయప్ప, నాగరాజు, కేశవ, రాధమ్మ పాల్గొన్నారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో, ప్రతిభా సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల దినోత్సవం జరిగింది. ఇందులో సమీప ఐదు మండలాల నుంచి తరలివచ్చిన విభిన్న ప్రతిభావంతులు తొలుత ర్యాలీ నిర్వహించారు. అనంతరం టింబక్టు కలెక్టివ్ వ్యవస్థాపకులు మేరీ వటమట్టం, బబ్లూగంగూలీ మాట్లాడుతూ.. విభిన్నప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతూ అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన విభిన్నప్రతిభావంతులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, అడ్మిన్ మేనేజర్ దుహిత గంగూలి, గ్రామ శిరిసొసైటీ సీఈఓ తిరుమలాదేవి, ధరణి సొసైటీ గొంది మహేశ్, ప్రతిభా సొసైటీ అధ్యక్షుడు రామాంజప్ప, ఉపాధ్యక్షురాలు పెద్దక్క, డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన

నార్పల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం అనంతపురం రూరల్ శక్తి టీం ఆధ్వర్యంలో శక్తి యాప్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఇందులో ట్రైనీ ఎస్ఐ గౌతం పాల్గొని విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, లైగింక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం శక్తి యాప్‌ను రూపొందించిందన్నారు. దీనిని ప్రతిఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలి

నార్పల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అర్హులైన పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 11లో గల స్థలంలో గత వైసీపీ ప్రభుత్వం ఇల్లు ఉన్నవారికి కూడా ఇంటి పట్టాలు మంజూరు చేసిందన్నారు. అక్రమంగా కొందరు పట్టాలు పొందడంపై విచారణ జరిపి వాటిని తిరిగి స్వాధీనం చేసుకుని అర్హులకు పంపిణీ చేయాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, సహాయ కార్యదర్శులు చాపల రామాంజి, సుధాకర్, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి: సీపీఎం

అనంతపురం టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఫ్లెక్సీ ఫ్రేమ్ మీద పడి తీవ్ర గాయాలపాలైన ఇద్దరిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి సోమవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లికి చెందిన సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు సోమవారం జిల్లాకేంద్రంలోని బళ్లారి రోడ్డు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వైపు బైక్‌లో వెళ్తుండగా మార్గంమధ్యలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనుచరులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఫ్రేమ్ వారిపై విరిగిపడిందన్నారు. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుని ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ఘటనపై నగరపాలకసంస్థ కమిషనర్ బాధ్యత వహించి బాధితులకు ఉచితంగా వైద్యం చేయించాలన్నారు. అనుమతుల్లేకుండా ఫ్లెక్సీలు కట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

అనంతపురంరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని చాలా వరకు కాపాడుకోవచ్చునని ఏపీఎంఏఎస్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీదేవి సూచించారు. జేఎన్‌టీయూఏ రోడ్డులోని వెన్నెల మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ మహిళా అభివృద్ధి సొసైటీ ఆధ్వర్యంలో నీరు, పారిశుధ్య, పరిశుభ్రతపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఏపీఎం రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మీదేవి పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. దీనివల్ల చాలావరకు అనారోగ్యాలు దరి చేరవన్నారు. అలాగే కాలకృత్యాలకు ఆరుబయటికి వెళ్లకుండా మరుగుదొడ్లు వాడాలని సూచించారు. వెలుగు సీసీలు, స్త్రీనిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలి

- ఆత్మా పీడీ పద్మలత

అనంతపురం రూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, లేకుంటే భూమిలో పోషకవిలువలు తగ్గిపోతాయని ఆత్మా పీడీ పద్మలత తెలిపారు. మండలంలోని చియ్యేడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం రబీ సీజన్‌లోని పంటలలో యాజమాన్య పద్ధతులు, ఇతరత్రా వాటిపై స్థానిక సహకార సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఆత్మా పీడీ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యాన పంటల సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. బయో ఫర్టిలైజర్స్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. పుట్టగొడుల సాగు, వాటి పోషకాల గురించి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏడీఏ శైలజాకుమారి, హార్టికల్చర్ అధికారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆత్మా పీడీ పద్మలత

'ఆ ఘటనను డీసీఎంఎస్‌కు అంటగట్టడం సరికాదు'



ఆస్పత్రిలో మెహతాజ్‌ను పరామర్శిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతి లే కుండా డీసీఎంఎస్ స్థలంలో దుకాణం ని ర్వహిస్తున్న మెహతాజ్ ఇతర కారణాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే.. ఆ ఘటనను ప్రభుత్వానికి అంటగట్టడం సరికాదని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు పేర్కొన్నారు. డీసీఎంఎస్ స్థలంలో అనధికారికంగా దుకాణం నిర్వహిస్తున్న మెహతాజ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను డీసీఎంఎస్ చైర్మన్‌తో పాటు, ఉమ్మడి జిల్లా మేనేజర్ విజయభాస్కర్, ఏఓ సుధాకర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. అనంతరం డీసీఎంఎస్ చైర్మన్ మాట్లాడుతూ.. మెహతాజ్ ఆత్మహత్యాయత్నం ఘటనపై కొందరు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. అంతర్గత విషయాలతో మెహతాజ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడితే ఆ ఘటనను ప్రభుత్వానికి, డీసీఎంఎస్‌కి అంటగట్టడం సరికాదన్నారు. మెహతాజ్‌కి డీసీఎంఎస్ స్థలంలో ఎటువంటి సంబంధం లేదనే విషయాన్ని తెలుసుకోవాలని హితవుపలికారు. డీసీఎంఎస్ స్థలంలోని అద్దె జాబితాలో మెహతాజ్, వారి కుటుంబ సభ్యుల పేర్లే లేవని స్పష్టం చేశారు.

ఫ్యామిలీ కోర్టు అదనపు పీపీగా బుడేన్‌సాబ్



అనంతపురం క్రైం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా ఫ్యామిలీ కోర్టు, 7వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పి. బుడేన్ సాబ్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రిన్సిపల్ సెక్రెటరీ కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ హోదాలో ఆయన చార్జ్ తీసుకున్న తర్వాత మూడేళ్ల గానీ లేదా ఆయన సర్వీసు పూర్తయ్యే వరకూ ఈ రెండింటిలో ఏది ముందు వస్తే అది అమలు కానుంది. ఈయన గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో మూడేళ్ల పాటు పనిచేశారు. ఇప్పుడు మళ్లీ ప్రభుత్వం అవకాశం కల్పించింది. మంగళవారం ఆయన అదనపు పీపీగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

నివాసాల మధ్యన ఆస్పత్రికి అనుమతి ఇవ్వకండి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్యన ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతి ఇవ్వకండని స్థానిక జీసెస్‌నగర్ కాలనీవాసులు కోరారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధికారప్రతినిధి సరిపూటి రమణ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌కు వెళ్లి కలెక్టర్ ఆనంద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీసెస్‌నగర్‌లో నివాసాల మధ్య ఇరుకైన వీధిలో ఆసుపత్రి ఏర్పాటు చేయడం మంచిదికాదన్నారు. అందుకు అనుమతి ఇవ్వరాదని కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం వారునగరపాలక సంస్థ కార్యాలయంలో ఏఎంసీ కమిషనర్ బాలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ స్వామి యాదవ్, మున్వర్, పూలబాషా, సరిపూటి శ్రీకాంత్, హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాల ప్రతుల దహనం

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలోని టవర్‌క్లాక్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రైతు వ్యతిరేక చట్టాల ప్రతులను దహనం చేశారు. ఈసందర్భంగా నాయకులు మల్లికార్జున, చంద్రశేఖరరెడ్డి, నాగరాజు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు వ్యవవసాయాన్ని కట్టబెట్టడానికే మోదీసర్కారు రైతు విత్తన నల్లచట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టాలను ఉపసంహరించుకునే వరకు పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నప్ప యాదవ్, బీహెచ్‌రాయుడు, వీటీ రామాంజనేయులు, రామక్రిష్ణ, కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శైలజానాథ్

గార్లదిన్నె, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో అప్పుల బాధ తాళలేక ఇటీవల గుర్రప్ప అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏ పంట వేశారు, ఎంత అప్పు ఉంది అని ఆరా తీశారు. ఆందోళన చెందకండి.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మండల కన్వీనర్ యల్లారెడ్డి, నాయకులు తరిమెల గోకులరెడ్డి, ఓబిరెడ్డి, సుంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

గార్లదిన్నె, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతోపాటు కల్లూరు గ్రామంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఏడీఏ వెంకట్రాముడు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ సోమవారం తనిఖీలు చేశారు. ఆయాప్రాంతాల్లోని తిరుమల ఫర్టిలైజర్స్, పెన్నోబిలేసు స్వామి, లక్ష్మీనరసింహ, రైతు మిత్ర, కిసాన్ ఆగ్రిక్లినిక్ దుకాణాల్లో వారు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు, ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. కిసాన్ అగ్రిక్లినిక్ దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న రూ. 2, 81, 136 విలువ చేసే మందులను గుర్తించి వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులను అనుమతులు ఉన్న వాటిని మాత్రమే విక్రయించాలని దుకాణాల యజమానులకు సూచించారు. నాణ్యమైన మందులు, ఎరువులు విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు దుకాణాలు నిర్వహించాలన్నారు. విరుద్ధంగా వ్యవహరిస్తు ఎంతటి వారిపైన అయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

రెజ్లర్‌కు సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలలో జిల్లాలోని నార్పలకు చెందిన బాల శ్రీహర్ష ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. దీంతో ఈనెల 11వతేదీ నుంచి గుజరాత్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరపున పాల్గొననున్నారు. ఇందుకుగాను అతన్ని సోమవారం జిల్లాకేంద్రంలో యాదవ సంఘం నాయకులు అభినందిస్తూ పుష్పగుచ్ఛాలందజేసి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యాదవ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ యాదవ్, ఉపాధ్యక్షుడు నరసింహులు యాదవ్, జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్ యాదవ్, కార్పొరేటర్ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రెజ్లింగ్ విజేతను సన్మానిస్తున్న యాదవసంఘం నాయకులు

న్యూస్ బాక్స్

నేమకల్లుకు నేటి నుంచి బస్సు

ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బొమ్మనహాళ్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇటు గ్రామస్థులు.. అటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని ఏడాదిక్రితం సీఎం చంద్రబాబు హామీ ఇచ్చినా... అది అమలు కాలేదు. దీనిపై ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి వెంటనే స్పందించిన ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు మంగళవారం నుంచే ఆ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరిస్తామని ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రజలు బస్సు ఎక్కకపోవడం వల్లే ఆ సర్వీసును అధికారులు నిలిపేశారని, ఇకనైనా ఆర్టీసీ బస్సును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జవాన్‌కు సన్మానం



జవాన్ వంశీయాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

పుట్లూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందికాపుల గ్రామానికి చెందిన వంశీయాదవ్ ఆర్మీకి సెలెక్ట్ అయ్యారు. దీంతో అతన్ని గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్బరాయుడు, రామాంజియాదవ్, వెంకటరమణయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపిక

గుంతకల్లుటౌన్,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న టీ మధు, బీ మహేంద్ర అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకున్నారు. బీకాం ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎన్‌సీసీ క్యాడెట్ టీ మధు ఈఎంఈ భోపాల్‌లో ఏడు నెలల శిక్షణ పూర్తి చేసుకొని .. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ 622 ఈఎంఈ బెటాలియన్‌లో పోస్టింగ్ పొందారు. బీ మహేంద్ర ఎంఈజీ బెంగళూరులో ఏడు నెలల శిక్షణ పూర్తి చేసుకుని పంజాబ్‌లోని పటాన్ కోట్ పోస్టింగ్ పొందారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య సోమవారం అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



షెక్షావలి

కణేకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాలపై పర్యవేక్షణ నిమిత్తం డిప్యూటీ ఎంపీడీవోగా నియమించిన వై షెక్షావలి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెనుగొండలో ఆర్‌డబ్ల్యూఎస్ సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడి బదిలీపై వచ్చారు.



ఏకాంబరేశ్వరయ్య

● బెళుగుప్ప : డిప్యూటీ ఎంపీడీవోగా ఏకాంబరేశ్వరయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

● యాడికి: డిప్యూటీ ఎంపీడీవో-2గా కాంతమ్మ బాధ్యతలు స్వీకరించారు. గార్లదిన్నె ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అయిన ఈమె ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

నిరుపేదలకు తోపుడుబండ్లు అందజేత

తాడిపత్రి,డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతులయ్యపాలెంలో నివాసమున్న వీఆర్‌రామిరెడ్డి, వీఆర్ వెంకటేశ్వర్‌రెడ్డి ఐదుగురు నిరుపేద మహిళలకు రూ.20వేలు విలువజేసే తోపుడుబండ్లను సోమవారం అందజేశారు. గతంలో ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సు, యూనిఫాంలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

విత్తన పంపిణీ

బెళుగుప్ప, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఏవో పృథ్వీ సాగర్ ప్రారంభించారు. అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఏవో సూచించారు.

● రాయదుర్గంరూరల్ : రాయితీతో విత్తన వేరుశనగ కోసం రైతు సేవ కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏఓ అహ్మద్‌బాషా సూచించారు. క్వింటా రూ. 5520కు అందజేస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా సామగ్రి అందజేత

వజ్రకరూరు(ఉరవకొండ), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయులు పాఠశాలకు రూ.26 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని హెచ్‌ఎం వేణుగోపాల్‌కు సోమవారం అందజేశారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు జలాలుద్దీన్ రూ.14 వేలు విలువ గల సైకిల్‌ను అందజేశారు.



క్రీడా సామగ్రితో ఉపాధ్యాయులు, విద్యార్థులు

విత్తన బిల్లుపై నిరసన

ఉరవకొండ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెస్తున్న విత్తన బిల్లు-2025ను వ్యతిరేకిస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు సోమవారం నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గాంధీ విగ్రహం వద్ద విత్తన బిల్లుల కాపీలను దగ్ధం చేశారు. ఏపీ రైతు సంఘం నాయకుడు మధుసూధన్ మాట్లాడుతూ.. ఈ విత్తన బిల్లు ప్రైవేట్, కార్పొరేట్ విత్తన కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా ఉందన్నారు. ఈ బిల్లు వల్ల నకిలీ విత్తనాల వల్ల పంటలు దెబ్బ తింటే రైతులకు ఎలాంటి పరిహారమూ చెల్లించే బాధ్యత విత్తన కంపెనీలకు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, వెంకటేశులు, శీనప్ప, సురేష్ పాల్గొన్నారు.

● వజ్రకరూరులోని గాంధీ విగ్రహం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో విద్యుత్, విత్తన బిల్లుల కాపీలను రైతులు దహనం చేశారు. ఇందులో రైతు సంఘం నాయకులు విరుపాక్షి, సుధాకర్, వెంకటేష్, పెద్దన్న, షేక్షావలి పాల్గొన్నారు.



ఉరవకొండలో బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు



కణేకల్లులో కమ్ముకున్న పొగమంచు



కూడేరు రోడ్లను కమ్మేసిన పొగమంచు


కమ్మేసిన పొగమంచు

పంటలు దెబ్బతింటాయని రైతుల ఆందోళన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్ : కూడేరు మండలాన్ని వారం రోజులుగా మంచు దుప్పటి కప్పేస్తోంది. రోడ్లపై పొగమంచు దట్టంగా కమ్ముకొని ఉండటంతో.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎనిమిది గంటలైనా వాహనదారులు లైట్లు వేసుకొని వెళ్తున్నారు. కణేకల్లు మండలంలోనూ పొగమంచు రోజురోజుకు పెరుగుతోంది. సోమవారం ఉదయం 9 గంటలైనా పొగమంచు వీడటం లేదు. శెట్టూరు మండలంలో సోమవారం పంటపొలాలు, పల్లెలను పొగమంచు పూర్తిగా కమ్మేసింది. పప్పుశనగ పూత మంచు ప్రభావానికి నేలరాలిపోతోందని రైతులు వాపోతున్నారు. బెళుగుప్ప మండలంలో పల్లెలను పొగమంచు కమ్మేసింది. ఉదయం 7 గంటలైనా పొగమంచు వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

యాడికి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): యాడికిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని సోమవారం రాత్రి అంగరంగవైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో కన్నెస్వామిపూజ, లక్షార్చన నిర్వహించారు. సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని పేటతుళ్లి నాట్యాలు, వివిధ వేషధారణలతో నృత్యాలు, భజన బృందాలు, 108దీప జ్యోతులతో అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆలయ అర్చకుడు నాగరాజుశర్మ, గురుస్వామి హరినాథ్, అయ్యప్ప మాలాధారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



అలంకరణలో అయ్యప్పస్వామి



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు

చిట్టీల నిర్వాహకురాలిని అరెస్ట్ చేయాలి



ధర్నా చేస్తున్న బాధితులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిట్టీ డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన దిల్షాద్ బేగంను వెంటనే అరెస్ట్ చేయాలని స్థానిక రీగల్ టాకీస్ సర్కిల్‌లో సోమవారం బాధితులు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తమకు రావాల్సిన రూ. లక్షలు ఇవ్వకుండా మోసం చేసి... తమపైనే కేసు పెట్టేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. తమకు న్యాయం జరిగే వరకు ధర్నా విరమించేది లేదని భీష్మించారు. దీంతో సుమారు గంట పాటు రోడ్డు ట్రాఫిక్ స్తంభించింది. చివరకు పోలీసులు వారికి నచ్చచెప్పడంతో వారు రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జ్యోతి, బాధితులు పర్వీన్, కౌసర్, షాకీరా, అరుణమ్మ, కాంత, మంజుల పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో మహిళల ఆర్థికాభివృద్ధి

పరిశ్రమలశాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న పరిశ్రమలశాఖ ఏడీ

యాడికి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని, దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని పరిశ్రమలశాఖ జిల్లా ఏడీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం యాడికిలోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాల సభ్యులు చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ఈ సదస్సులో ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, నిశాంత్, శ్రీనాథ్, భువనేశ్వరి, డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కమ్మ సేవాసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కమ్మ సేవాసంఘం సభ్యులు

గుంతకల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్మ సేవా సంఘ నాయకులు ఆ సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. సోమవారం స్థానిక పరిటాల శ్రీరాములు కల్యాణ మండపంలో కమ్మ సేవా సంఘ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ వెంకటేశ్వర్లు, కేసీ హరి కుమార్, అతిథులుగా విచ్చేశారు. ఆ సంఘ అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు మాట్లాడుతూ.. సంఘ కల్యాణ మండపాన్ని పునర్నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కమ్మసేవా సంఘ కార్యదర్శి దామోదర్ నాయుడు, ఉపాధ్యక్షుడు రమేశ్, కోశాధికారి రమణ, సభ్యులు వరప్రసాద్, తమ్మినేని ప్రభాకర్, యుగంధర్, ఏరూరు మోహన్, చింబిలి నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై దృష్టి సారించండి: ఎమ్మెల్యే



సమస్యలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం ప్రజావేదికలో పలు కాలనీలకు చెందిన మహిళలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత: శెట్టూరు మండలం యాటకల్లు వాసి గరుడాపురం ధనుంజయకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.25,833 మంజూరైంది. ఆ చెక్కును ధనుంజయ తండ్రి బ్రహ్మయ్యకు ఎమ్మెల్యే అందజేశారు.

● ఎమ్మెల్యే సూచన మేరకు ఎస్సార్సీ ట్రస్ట్ కుందుర్పి జూనియర్ కళాశాలకు పది కంప్యూటర్లను అందజేసింది.

నిర్మాణ పనులకు భూమిపూజ

గుంతకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మహబూబాబాద్‌లో రోడ్డు నిర్మాణానికి, హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపాలిటీ వాహనాల మరమ్మతు వర్క్‌షాప్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి సోమవారం భూమిపూజ చేశారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ నయ్యాం అహ్మద్, ఎంఈఈ ఇంతియాజ్ అలీ, సింగిల్ విండో సొసైటీ చైర్మన్ తలారి మస్తానప్ప, టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, హనుమంతు, అరుణ, రంగన్న, రవి, ఫజులు, అంజి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రముఖులు

ఈ హెచ్‌ఎం మాకొద్దు బాబోయ్

పూలకుంటలో విద్యార్థులు, గ్రామస్థుల నిరసన

గుమ్మఘట్ట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట అయ్యప్పనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బషీర్ అహ్మద్‌ను విధుల నుంచి తొలగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ పాఠశాల ఎదుట రోడ్డుపై బైఠాయించారు. మధ్యాహ్న భోజన సరుకులను ఏజెన్సీలకు సక్రమంగా ఇవ్వడం లేదని, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల పట్ల దురుసుగా.. సైకోలా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. హెచ్‌ఎంను తొలగించే దాకా తమ పిల్లలను పాఠశాలకు పంపబోమని గంటపాటు రాస్తారోకో చేశారు. పాఠశాలకు చేరుకున్న ఎస్ఐ ఈశ్వరయ్య విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, ఎంఈఓ సోమశేఖర్ ఆ పాఠశాలకు చేరుకొని.. విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నత అధికారులకు పంపుతామన్నారు. కాగా, బషీర్‌అహ్మద్ గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ ఇలాగే ప్రవర్తించి.. సస్పెండ్ అయ్యారు.

● కుందుర్పి : కొలిమిపాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం దేవి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆ గ్రామస్థులు మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీదేవి, తిప్పేస్వామికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఆమె విధులకు సరిగా రారని, ప్రశ్నిస్తే దురుసుగా ప్రవరిస్తున్నారని వాపోయారు. ఆమె భర్త పాఠశాలలో సిబ్బందిపై పెత్తనం చెలాయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామ కన్వీనర్ లింగప్ప నరసింహ, గిడ్డప్ప, నగేష్ ఉన్నారు.





పూలకుంటలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కుందుర్పి ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న కొలిమిపాల్యం గ్రామస్థులు

దుకాణంలో అగ్నిప్రమాదం.. రూ.కోటి నష్టం



దగ్ధమవుతున్న ఫర్నిచర్ దుకాణం

తాడిపత్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కడప రహదారిలో ఫర్నీచర్ మ్యానుఫ్యాక్చరింగ్ దుకాణంలో సోమవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. దుకాణంలో యుపీవీసీ విండోస్ ఫర్నీచర్ తదితర సామగ్రి, వస్తువులు, మిషనరీ పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ. కోటి ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు మోహనాచారి వాపోయారు.

రోడ్డు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి

తాడిపత్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో మెకానికల్ టెక్నీషియన్ రాంమోహన్‌రెడ్డి (55) మరణించాడు. ఇతను పట్టణ సమీపంలోని ఐశ్వర్య విల్లాస్‌లో నివాసముంటున్నాడు. రాత్రి బైక్‌పై పట్టణంలోకి వచ్చిన అతను తిరిగి ఇంటికి వెళ్తుండగా.. బస్టాండ్ వద్ద అతని బైక్‌ను ఓ లారీ వెనుక వైపు నుంచి ఢీకొంది. కిం దపడటంతో తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రాంమోహన్‌రెడ్డికి భార్య మహేశ్వరి, కుమారులు శ్రీకాంత్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రాయదుర్గంరూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని నాన్‌చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ నాగరాజుకు అప్పగించినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 5 వేలు వంతున అపరాధ రుసుము విధించారు.

లక్షుంపల్లిలో కేబుల్ చోరీ

యాడికి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): లక్షుంపల్లిలో రైతు దివాకర్‌రెడ్డి పొలంలోని బోరుబావికి ఉన్న 20 మీటర్ల కేబుల్‌ను దుండగులు ఆదివారం రాత్రి చోరీ చేశారు. దీని విలువ రూ.5వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

మట్కాబీటర్ల అరెస్ట్

తాడిపత్రి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీకట్ట వద్ద సోమవారం మట్కా నిర్వహిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. వారినుంచి రూ.57,560 స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామన్నారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కసాపురం ఈఓ భేటీ



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఈఓ

గుంతకల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుత్తి మండలంలోని బాట సుంకులమ్మ ఆలయానికి వచ్చిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌తో కసాపురం దేవస్థాన ఈఓ విజయరాజు సోమవారం భేటీ అయ్యారు. ఆలయ సిబ్బంది ఆయనకు నెట్టికంటి ఆంజనేయుడి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. విజయానంద్ మాట్లాడుతూ... ప్రభుత్వం తలపెట్టిన క్యాష్ లెస్ ట్రాన్సాక్షన్, వాట్సాప్ గవర్నెన్స్‌ను, ఆన్‌లైన్ సేవా కార్యక్రమాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఓకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు రాఘవాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.